RNI: TEL TEL /2019/12836

# అభ్యుదయం

The Pride of Telugu national daily



Wanted Reporters

తెలుగు రాష్ట్రాల్లో నియోజక వర్గాల వారిగా విలేఖరులు కావలెను

తెలంగాణ :- 9700026263
ఆంధ్రప్రదేశ్:- 9885426263

పబ్లిషర్ :ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ శనివారం 26- 9- 2026 సంపుటి : 6 సంచిక : 227 ఎడిటర్ : ఆనంద్ రావు పేజీలు : 8 వెల : 3-00



## హైదరాబాద్ మహానగరంలో గణేశ్ శోభాయాత్ర

- మధ్యాహ్నానికే గంగ ఒడికి ఖైరతాబాద్ గణపతి
- జనసంద్రమైన హుస్సేన్‌సాగర్ పరిసరాలు
- 30 వేలమంది పోలీసులు, 20 డ్రోన్లు, షీ టీమ్‌లతో నిఘా
- రూ.39 లక్షలు పలికిన బాలాపూర్ గణేశుడి లడ్డు
- రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రమాదాల్లో 13 మంది మృతి: డీజీపీ

మిగతా 2లో

## డీజే మోత.. ఆరోగ్యానికి ముప్పు!

- చెవులకే కాదు.. గుండెపైనా అధిక శబ్దం ప్రభావం
- శబ్ద తీవ్రత పెరిగేకొద్దీ తగ్గిపోతున్న సురక్షిత వినికిడి సమయం
- నిమజ్జనాలు, ఊరేగింపుల్లో అప్రమత్తత అవసరం
- ఇయర్‌ఫోన్స్, ఇయర్‌బడ్స్‌తోనూ జాగ్రత్త




## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

- మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ ధ్యేయం
- 10--15 రోజుల్లో కొత్త పింఛన్ల పంపిణీ
- మహిళా సంఘాలకు వడ్డీలేని రుణాలు
- ఇందిరమ్మ ఇళ్లలో నిరుపేదలకు తొలి ప్రాధాన్యం
- స్మార్ట్ రేషన్ కార్డులతో పారదర్శక పంపిణీ
- మంత్రి ధనసరి అనసూయ సీతక్క



2లో

## దేశంలో యువత భవిష్యత్తును దెబ్బతీసే ప్రయత్నాలు



- సంఘ్ పరివార్ అంటే దేశ విభజన
- గాంధీ పరివార్ అంటే దేశ ఐక్యత
- దేశంలో ఓట్లు, నిధులు, గుర్తుల చోరీ
- మార్పునకు సూచిక కేరళం ఇక్కడ అధికారంలో మార్పు వస్తే.. కేంద్రంలోనూ కాంగ్రెస్‌దే అధికారం
- ఆర్యదాన్ ముహమ్మద్ అవార్డు స్వీకరణసందర్భంగా సీఎం రేవంత్

హైదరాబాద్, **అభ్యుదయం**

ఓట్లు, పార్టీలు, నిధులు, ఎన్నికల గుర్తుల దొంగతనం దేశంలో జరుగుతోందని, యువత భవిష్యత్తును దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ పరిస్థితుల్లో ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉన్న ఓటు హక్కును కాపాడాల్సిన అవసరం అందరిపైనా ఉందన్నారు. సంఘ్ పరివార్ సారథ్యంలోని బీజేపీ దేశాన్ని మతం పేరిట విభజిస్తుంటే.. గాంధీ పరివార్ మాత్రం దేశ ఐక్యతకు కృషి చేస్తోందని చెప్పారు. తనకు వ్యక్తిగతంగా, రాజకీయంగా పెద్ద ఆశలు లేవన్నారు.జట్పీటీసీగా ప్రజా ప్రాతినిథ్య ప్రస్థానాన్ని 2006లో ప్రారంభించిన తాను.. ఈ రెండు దశాబ్దాల్లో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ, టీపీసీసీ చీఫ్, సీఎం వంటి పదవులను చూశానని, ఇక తన ముందు ఉన్న ఏకైక లక్ష్యం రాహుల్ గాంధీని భారత ప్రధాన మంత్రిగా చూడటమేనని పునరుద్ఘాటించారు. కేరళంలో మొదలైన రాజకీయ మార్పు అనే గాలిని దేశంలోని ప్రతి ఇంటికి, వీధికి, గ్రామానికి, నగరానికి, ప్రతి రాష్ట్రానికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా

మిగతా 2లో

## సీఈసీపై విచారణకు ఆదేశించండి



- ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండా నిర్ణయాలు తీసుకున్నారు
- ఆ నిర్ణయాలను, సాఫ్ట్‌వేర్ మార్పులను చెల్లనివిగా ప్రకటించాలి
- ఫారం-6లో మార్పులను రద్దు చేయాలి
- సుప్రీంలో అడ్వొకేట్ శైలేంద్ర పిటిషన్

## సీఎం గారూ మీలోని అపర దళిత ప్రేమికుడు ఎక్కడ?

- ఆయన ఇలాకాలో దళితులపై వివక్ష
- ఎస్సీ ప్రజాప్రతినిధులపై చిన్నచూపు
- సర్పంచ్ కాశమ్మ చేసిన ఆరోపణలపై సిట్ ఎందుకు ఏర్పాటు చేయడం లేదు?
- బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ నిలదీత



హైదరాబాద్, **అభ్యుదయం**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత ఇలాకా అయిన వంగూరు మండల పరిధిలోని ఎస్సీ ప్రజాప్రతినిధులు, మహిళలపై తీవ్ర వివక్ష కొనసాగుతున్నదని బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ధ్వజమెత్తారు. ఆ మండలంలోని జాజాల గ్రామ సర్పంచ్ కాశమ్మ చేసిన ఆరోపణలపై సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు స్పందించడం లేదని, శాసనసభ స్పీకర్‌పై చూపుతున్న శ్రద్ధ ఆమెపై ఎందుకు చూపడం లేదని ప్రశ్నించారు. సీఎం గారూ మీలోని అపర దళిత ప్రేమికుడు ఎక్కడ? అని ఎద్దేవా చేశారు.

మిగతా 2లో

## కాళేశ్వరం జలాశయాలు నింపండి.. రైతుల ఆవేదన కనిపిస్తలేదా?

- గోదావరిలో భారీగా వరద పోతుంటే.. బురద రాజకీయాలా?
- రంగనాయకసాగర్‌లో నీళ్లులేక నర్మెట పామాయిల్ ఫ్యాక్టరీ బంద్
- మోటర్లు నడిపి గోదావరి జలాలతో రిజర్వాయర్లు నింపండి
- నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కు హరీశ్‌రావు లేఖ



హైదరాబాద్, **అభ్యుదయం**

గోదావరి నదిలో భారీగా వెళ్తున్న వరద జలాలను ఎత్తిపోసి కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని రిజర్వాయర్లను నింపాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆన్ ఆఫ్ పద్ధతిలో కాకుండా 24 గంటలపాటు అన్ని మోటర్లను నడుపాలని కోరారు. రాష్ట్రంలో ఒకవైపు వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, మరోవైపు గోదావరిలో భారీగా వరదనీరు పోతున్నా ఆ వరదను ఎత్తిపోసి జలాశయాలను నింపడంలో కాంగ్రెస్ సర్కార్ చోద్యం చూస్తున్నదని విమర్శించారు. ఈ మేరకు సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి శుక్రవారం హరీశ్‌రావు లేఖ రాశారు. అన్నపూర్ణ, రంగనాయకసాగర్ రిజర్వాయర్లు డెడ్‌స్టోరేజీలో ఉన్నాయని, 50 టీఎంసీల నిల్వ సామర్థ్యం ఉన్న మల్లన్నసాగర్‌లో ప్రస్తుతం సుమారు 13 టీఎంసీల నీరే ఉన్నదని ఆ లేఖలో పేర్కొన్నారు

మిగతా 2లో



## పంట నష్టాలపై తక్షణ సర్వే

- దెబ్బతిన్న రోడ్లకు అత్యవసర మరమ్మతులు
- నీరు నిలిచిన పొలాల్లో పంటల రక్షణకు చర్యలు చేపట్టాలి
- మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

2లో

## సీఎం గారూ మీలోని అపర

# దళిత ప్రేమికుడు ఎక్కడ?

ఎస్సీలపై వివక్ష విషయంలో సిట్‌ను ఎందుకు ఏర్పాటు చేయడం లేదని, సుమోటోగా ఎందుకు కేసు నమోదు కావడం లేదని శుక్రవారం ఎక్స్ వేదికగా సీఎ రేవంత్‌రెడ్డిని నిలదీశారు. సీఎం ఏజెంట్ నరేందర్‌రెడ్డి మాఫియా విచ్చలవిడిగా ఇసుక దందా చేస్తున్నదని సర్పంచ్ ఆరోపించారని, ఆమె చేసిన ఆ వ్యాఖ్యల వీడియోను ఎక్స్‌లో పోస్టు చేశారు. నిందితులపై చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. విజిలెన్స్ అధికారులు ఎకడున్నారు? వంగూరులో పెద్దఎత్తున పేరుకుపోయిన ఇసుక మేటలు అధికారులకు కనిపించడం లేదా? అని నిలదీశారు. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ నేతలు, ప్రజాప్రతినిధులు ఎందుకు స్పందించడం లేదని పేర్కొన్నారు. వేముల వీరేశం, సీతక, బీర్ల ఐలయ్య, కుంభం అనిల్‌రెడ్డి, కాంక్షారెడ్డి ఎకడ ఉన్నారని ప్రశ్నించారు. గజ్వేల్‌లో చేయని నేరానికి మూడు కేసులు నమోదు చేశారని ఆరోపించిన ప్రవీణ్.. ఇసుకదందాపై వచ్చిన ఆరోపణల విషయంలో ఎందుకు అదే తరహాలో చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు.

## హైదరాబాద్ మహానగరంలో గణేశ్ శోభాయాత్ర

సర్వాంగ సుందరంగా అలంకరించిన వాహనాలు.. భక్తుల భజనలు, కోలాటాలు, నృత్యాలు.. గణేశ్ మహారాజ్ కీ జై అనే నినాదాల మధ్య గౌరీ తనయుడు గంగ ఒడికి చేరాడు. ఎప్పటిలాగే హైదరాబాద్ మహానగరంలో గణేశ్ శోభాయాత్ర వేలాది మంది భక్తుల కోలాహలం, కేరింతల మధ్య శుక్రవారం అద్భుతంగా సాగింది. రాష్ట్రవ్యాప్తంగా విఘ్నేశ్వరుడి వీడ్కోలు యాత్రలు ఎలాంటి విఘ్నాలు లేకుండా ముగిశాయి. బాలాపూర్ గణేశుడు ఈసారి కూడా అందరి దృష్టినీ ఆకర్షించి తన ప్రత్యేకతను చాటుకున్నాడు.ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావించే బాలాపూర్ గణేశుడి లడ్డు వేలంపాటలో ఈసారి రికార్డు స్థాయిలో రూ.39 లక్షలు పలికింది. శోభాయాత్రలో ఖైరతాబాద్ మహాగణపతి ప్రత్యేక ఆక ర్షణగా నిలిచాడు. ఈ మహానిమజ్జన కార్యక్రమాన్ని అన్ని శాఖల అధికారులు చక్కని సమన్వయంతో ఎలాంటి అవాంతరాలు లేకుండా నిర్వహించారు. పోలీసులు భూమార్గంతోపాటు ఆకాశం నుంచి కూడా నిరంతరం నిఘా ఉంచి శోభాయాత్రను ప్రశాంతంగా పూర్తిచేశారు.

**ఉరిమే ఉత్సాహం.. సడలని భక్తి పారవశ్యం**

గణేశ్ శోభాయాత్ర ఆద్యంతం భక్తుల ఉత్సాహం, భక్తిపారవశ్యంతో కొనసాగింది. ఖైరతాబాద్ పంచముఖ సంకటహర గణపతి శోభాయాత్ర సమయంలో సాగర తీరం జనసంద్రంగా మారింది. హుస్సేన్‌సాగర్, సరూర్‌నగర్, సఫిల్‌గూడ, ఐడీఏ బొల్లారం తదితర ప్రధాన కేంద్రాలతోపాటు కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలోని 140 చోట్ల గణపతి విగ్రహాల నిమజ్జనాలు జరిగాయి. రాణిగంజ్ వైపు నుంచి వచ్చిన 20 అడుగుల విగ్రహం ట్యాంక్‌బండ్ ప్రవేశ ద్వారం (కమాన్) వద్ద చిక్కుకోవటంతో రెండు గంటలపాటు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.నగర ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, డీజీపీ సీవీ ఆనంద్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక ఆల హెలికాప్టర్ ద్వారా శోభాయాత్ర, హుస్సేన్‌సాగర్ వద్ద నిమజ్జన పర్వాన్ని పరిశీలించారు. గతేడాదితో పోలిస్తే ఖైరతాబాద్ మహాగణపతి శోభాయాత్ర 3.30 గంటలు ఆలస్యంగా ఉదయం 9.35 గంటలకు ప్రారంభమైంది. మధ్యాహ్నం 2.43 గంటలకు ఎన్టీఆర్ మార్గ్‌లోని 4వ నెంబరు క్రేన్ వద్ద నిమజ్జనం చేశారు. మహాగణపతి శోభాయాత్రలో మాజీ ఎమ్మెల్యే దానం నాగేందర్, మహిళా కానిస్టేబుళ్లతో కలిసి ప్యారడైజ్ సినిమాలోని ఆయాషేర్ పాటకు స్టెప్పులేశారు.

**15 వేలమంది పారిశుద్ధ్య కార్మికుల సేవలు**

హుస్సేన్‌సాగర్‌కు వచ్చే భక్తుల కోసం నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ 600 బస్సులు, రైల్వే శాఖ అదనపు ఎంఎంటీఎస్ రైలు సర్వీసులు నడిపాయి. మెట్రో రైళ్లు రాత్రి 2 గంటల వరకు నడిచాయి. 303 కి.మీల శోభాయాత్ర మార్గంలో ఎప్పటికప్పుడు వ్యర్థాలు తొలగించేందుకు సుమారు 15 వేల మంది పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహించారు.

ప్రధాన నిమజ్జన కేంద్రాల వద్ద ఎన్‌డీఆర్ఎ?ఫ, హైడ్రా డీఆర్‌ఎఫ్ ఆధ్వర్యంలో 200 మంది గజ ఈతగాళ్లు, బోట్లు అందుబాటులో ఉంచారు. శోభాయాత్ర వేగంగా ముందుకు సాగేలా పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

## సీఈసీపై విచారణకు ఆదేశించండి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 25 దేశ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపిన కేంద్ర ఎన్నికల కమిషన్ వ్యవహారం సుప్రీంకోర్టుకు చేరింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియలో చట్టబద్ధ విధులను విస్మరించిన ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌పై క్రిమినల్ విచారణకు ఆదేశించాలంటూ పిటిషన్ దాఖలైంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద అడ్వొకేట్ శైలేంద్ర మణి త్రిపాఠి శుక్రవారం ఈ పిటిషన్‌ను వేశారు. మిగతా ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండా సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ప్రారంభించిన, ఆమోదించిన, అమలు చేసిన అన్ని నిర్ణయాలు, మార్గదర్శకాలు, ఆదేశాలు, సాఫ్ట్‌వేర్ మార్పులను రాజ్యాంగ విరుద్ధమైనవిగా, చెల్లనివిగా ప్రకటించాలని సుప్రీంకోర్టును కోరారు. 'సర్' ప్రక్రియకు సంబంధించిన నిర్ణయాలు, ఫారం-6లో మార్పులు, ఓటర్ల జాబితా డేటా నిర్వహణ తదితర అంశాలపై ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, వివేక్ జోషి 14 సందర్భాలలో అభ్యంతరాలను నమోదు చేసిన అంశం తాజాగా బయటికి వచ్చిన విషయం తెలిసిందే.

## ఫిరాయింపులపై బీజేపీ నేతల నీతులా?..

## బీఆర్‌ఎస్ మాజీ ఎంపీ వినోద్



హైదరాబాద్, సెప్టెంబర్ 25 బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ మండిపడ్డారు. వారి మాటలు దయ్యాలే వేదాలు వల్లించినట్టు ఉన్నదని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అడ్డగోలుగా మాట్లాడే ముందు ఫిరాయింపు రాజకీయాలను మొదలుపెట్టింది కాంగ్రెస్.. ఇప్పుడు కొనసాగిస్తున్నది బీజేపీ కాదా? అని సూటిగా ప్రశ్నించారు. ఫిరాయింపులపై బీఆర్‌ఎస్‌కు నీతులు చెప్పేముందు గత చరిత్ర తెలుసుకోవాలని చురకలంటించారు.గత గురువారం విడుదల చేసిన ఏడీఆర్ (అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్) నివేదికే రెండు పార్టీల వైఖరికి అద్దంపట్టిందని విమర్శించారు. '2022 నుంచి 2026 మధ్య గెలిచిన 111 మంది పార్టీలు మార్చినట్టు వెల్లడించింది. బీజేపీ దాని మిత్రపక్షాలైన ఎన్సీపీఎఫ్, ఎన్సీపీ, శివసేన, ఎన్‌పీపీ, పీపీఏ పార్టీల్లోకే అత్యధికులు చేరారు' అని గుర్తుచేశారు. ఈ గణాంకాలే బీజేపీ ఫిరాయింపు రాజకీయాలకు సజీవ సాక్ష్యమని దెప్పిపొడిచారు. తెలంగాణలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల ఫిరాయింపులకు కాంగ్రెస్‌దే బాధ్యత అని తేల్చిచెప్పారు.

### దేశంలో యువత భవిష్యత్తును

# దెబ్బతీసే ప్రయత్నాలు

మార్పు గాలులు వీస్తున్నాయని, రాహుల్‌గాంధీ సందేశం ప్రజల్లోకి బలంగా వెళుతోందని చెప్పారు.

దేశాన్ని మతతత్వ శక్తుల నుంచి కాపాడేందుకు రాహుల్ గాంధీకి అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. కేరళంలోని నలంబూరులో శుక్రవారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రతిష్ఠాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్-2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డు'ను రేవంత్ రెడ్డి స్వీకరించారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ అవార్డును ఆయనకు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా, సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. కేరళంలో కాంగ్రెస్ పార్టీకి ఐదు దశాబ్దాలకుపైగా సేవలందించిన ఆర్యదాన్ ముహమ్మద్.. రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారని కొనియాడారు.

"నీలంబూర్‌తోపాటు కేరళంలో కాంగ్రెస్ పార్టీకి ఆయన ఒక బలమైన శక్తిగా నిలిచారు. జీవితాంతం స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పని చేశారు. ప్రస్తుతం మతతత్వ శక్తుల నుంచి ప్రమాదం ఉంది. స్వేచ్ఛ, లౌకికవాదం, రాజ్యాంగ విలువలను కాపాడటమే ఆర్యదాన్ ముహమ్మద్‌కు నిజమైన నివాళి" అని వ్యాఖ్యానించారు. ఆయన పేరిట ఏర్పాటు చేసిన అవార్డును తాను స్వీకరించడం గౌరవంగా భావిస్తున్నానన్నారు. కేరళం రాష్ట్రం వెలుపల నుంచి ఈ పురస్కారానికి ఎంపికైన తొలి వ్యక్తిగా తాను నిలవడం మరింత ప్రత్యేకమన్నారు. కాంగ్రెస్ కార్యకర్తగా, రాహుల్ గాంధీ నాయకత్వంలోని బృందంలో కార్యకర్తగా తాను ఈ అవార్డును స్వీకరిస్తున్నానని చెప్పారు.

**మార్పు.. కేరళం నుంచే!**

దేశ రాజకీయాల్లో కేరళం రాజకీయాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉందని, దేశ రాజకీయాలకు ఈ రాష్ట్రం బెల్ వెదర్ (మార్పునకు సూచి) వంటిదని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. రుతు పవనాల రాక కోసం వాతావరణ నిపుణులు కేరళం వైపునకు ఎలా చూస్తారో.. దేశ రాజకీయాలను అర్థం చేసుకునేందుకు కేరళం రాజకీయాన్ని ఒక సూచికగా చూడవచ్చని



వ్యాఖ్యానించారు. "1991లో కేరళంకు కరుణాకరన్ సీఎంగా ఉన్నప్పుడు పీవీ నరసింహారావు ప్రధాని అయ్యారు. ఈ రాష్ట్రంలో 1996లో కమ్యూనిస్టులు అధికారంలోకి వచ్చారు. అప్పుడు కేంద్రంలో కాంగ్రెస్ అధికారం కోల్పోయింది. మళ్లీ 2001లో కేరళంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. రాష్ట్రానికి ఏకే ఆంటోనీ సీఎంగా ఉన్నప్పుడే.. 2004లో కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. తాజాగా 2026లో కేరళంలో కాంగ్రెస్ విజయం సాధించింది. ఇక్కడి నుంచే కొత్త రాజకీయ గాలి మొదలైంది. ఈ గాలి.. దేశవ్యాప్తంగా తుపానుగా మారనుంది" అని వివరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశానికి రాహుల్ గాంధీ ప్రధాని కావాల్సిన అవసరం ఉందన్నారు.

**దూరదృష్టితో కూడిన నాయకత్వాన్ని గుర్తించే ఆర్యదాన్ ఫౌండేషన్ చైర్మన్ షౌకత్**

రైతులు, వెనుకబడిన వర్గాలు, ఇతర సామాజిక వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న వినూత్న కార్యక్రమాలు, సీఎం రేవంత్ రెడ్డి దూరదృష్టితో కూడిన నాయకత్వాన్ని గుర్తిస్తూ ఆయన్ను ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆర్యదాన్ మహమ్మద్ ఫౌండేషన్ చైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. ప్రజాస్వామ్య విలువల పట్ల సీఎం రేవంత్ చూపుతున్న నిబద్ధతను అవార్డు ఎంపిక కమిటీ ప్రశంసించిందని వెల్లడించారు. కార్యక్రమంలో కేసీ వేణుగోపాల్ ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకోపన్యాసం చేశారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు

భూపాలపల్లి, సెప్టెంబర్ 25 : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందించడంతో పాటు మహిళలను ఆర్థికంగా స్వావలంబులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. శుక్రవారం భూపాలపల్లి మండలం పెద్దాపూర్ రైతు వేదికలో పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కార్డులను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 15 లక్షల కొత్త రేషన్ కార్డులను మంజూరు చేసినట్లు తెలిపారు. రేషన్ కార్డు కేవలం బియ్యం, నిత్యావసర సరుకులు పొందేందుకే పరిమితం కాదని, ఆరోగ్యశ్రీ సేవలు, ఆదాయ ధ్రువీకరణతో పాటు అనేక ప్రభుత్వ పథకాలకు కీలకమైన అధికారిక పత్రంగా ఉపయోగప డుతుందని పేర్కొన్నారు. జిల్లాలో 1,39,530 స్మార్ట్ రేషన్ కార్డులు జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా, సురక్షితంగా నిత్యావసర సరుకులు అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఆగస్టు 15 నుంచి జిల్లా వ్యాప్తంగా పంపిణీ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. జిల్లాలో 1,39,530 స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా 3,95,962 మంది లబ్ధి పొందుతున్నట్లు వివరించారు. ర్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

# కాళేశ్వరం జలాశయాలు నింపండి..

# రైతుల ఆవేదన కనిపిస్తలేదా?

మల్లన్నసాగర్‌ను పూర్తిస్థాయిలో నింపితే హైదరాబాద్ తాగునీటి అవసరాలతోపాటు ప్రభుత్వం ప్రతిపాదిస్తున్న మూసీ ప్రాజెక్టుకు కూడా నీటిని తరలించే అవకాశం ఉంటుందని సూచించారు. కొండపోచమ్మసాగర్‌లో 15 టీఎంసీలకు 6 టీఎంసీలే ఉన్నాయని, ఆ రిజర్వాయర్‌ను నింపితే యాదాద్రి-భువనగిరి జిల్లాలోని బస్వాపూర్, గంధమల్ల రిజర్వాయర్లకు ప్రయోజనం కలుగుతుందని వివరించారు. గోదావరి జలాలను పూర్తిస్థాయిలో సద్వినియో గం చేసుకోవాలనే ఉద్దేశంతో 141 టీఎంసీల సామర్థ్యంతో అప్పటి సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవస్థను నిర్మించారని గుర్తుచేశారు.

**ఎల్లంపల్లి నుంచి ఎత్తిపోయండి**

ఎల్లంపల్లి నుంచి వరదనీటిని ఎత్తిపోసి మిడ్‌మానేరు, అన్నపూర్ణ, రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ సాగర్, గంధమల్ల, బస్వాపూర్ రిజర్వాయర్లను నింపాలని హరీశ్‌రావు సూచించారు. ఆ రిజర్వాయర్లను నింపితే దాదాపు 5 లక్షల ఎకరాలకు ప్రయోజనం ఉంటుందని తెలిపారు. మిడ్‌మానేరు దిగువన ఉన్న లోయర్ మానేరు డ్యామ్ (ఎల్‌ఎండీ)లో ప్రస్తుతం సుమారు 11 టీఎంసీల నీరే ఉన్నదని, ఎల్‌ఎండీకి నీటిని తరలిస్తే కరీంనగర్, వరంగల్ జిల్లాల్లో సాగు, తాగునీటి అవసరాలు తీరుతాయని పేర్కొన్నారు.

దీంతో పెద్దపల్లి, కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, యాదాద్రి-భువనగిరి, మేడ్చల్-మల్కాజిగిరి, హైదరాబాద్ జిల్లాల పరిధిలోని రైతులు, ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని తెలిపారు. రంగనాయకసాగర్‌లో నీరు లేక సిద్దిపేట జిల్లా నర్మెటలోని పామాయిల్ ఫ్యాక్టరీ నిర్వహణ ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. ఎల్ నినోను



సాకుగా చూపి బాధ్యత నుంచి సర్కార్ తప్పించుకోవద్దని హితవు పలికారు. రాజకీయాలను పకనబెట్టి గోదావరిలో వరద నీరు అందుబాటులో ఉన్నప్పుడే దానిని ఎత్తిపోసి జలాశయాలను నింపాలని, జాప్యంచేస్తే అందుబాటులో ఉన్న నీటిని కోల్పోయే ప్రమాదం ఉన్నదని ఆ లేఖలో పేర్కొన్నారు.

# డీజే మోత.. ఆరోగ్యానికి ముప్పు!

సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 25

పండుగ అంటే ఆనందం.. ఊరేగింపు అంటే ఉత్సాహం. వినాయక నిమజ్జన శోభాయాత్రల్లో డప్పులు, బ్యాండ్లు, డీజే పాటలకు యువత ఉత్సాహంగా నృత్యాలు చేయడం సహజంగా మారింది. అయితే చెవులు దద్దరిల్లే స్థాయిలో గంటల తరబడి భారీ శబ్దానికి గురికావడం ఆరోగ్యానికి మంచిది కాదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఇటీవల వినాయక నిమజ్జన ఊరేగింపుల్లో పాల్గొన్న కొందరు వ్యక్తులు నృత్యం చేస్తూ లేదా అనంతరం అస్వస్థతకు గురై మరణించినట్లు వివిధ ప్రాంతాల నుంచి వార్తలు వెలువడుతున్న నేపథ్యంలో భారీ డీజే శబ్దాల ప్రభావంపై మరోసారి చర్చ మొదలైంది. అయితే ఆయా మరణాలకు డీజే శబ్దమే ప్రత్యక్ష కారణమని వైద్య నిర్ధారణ లేకుండా చెప్పలేం. గుండె సంబంధిత సమస్యలు, తీవ్రమైన శారీరక శ్రమ, డీహైడ్రేషన్, ఇతర ఆరోగ్య పరిస్థితులు కూడా కారణాలు కావచ్చు.

**శబ్దం పెరిగితే.. శరీరంపై ఒత్తిడి**

అధిక శబ్దం కేవలం చెవులకే పరిమితమైన సమస్య కాదు. తీవ్రమైన శబ్దానికి గురైనప్పుడు శరీరం ఒత్తిడికి స్పందిస్తుంది. గుండె కొట్టుకునే వేగం, రక్తపోటులో మార్పులు రావచ్చు. ముఖ్యంగా ఇప్పటికే గుండె జబ్బులు, అధిక రక్తపోటు వంటి సమస్యలు ఉన్నవారు మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

దీర్ఘకాలం అధిక పర్యావరణ శబ్దానికి గురికావడం హైపర్‌టెన్షన్, ఇస్కీమిక్ హార్ట్ డిసీజ్ వంటి ఆరోగ్య సమస్యల ప్రమాదంతో సంబంధం కలిగి ఉన్నట్లు అంతర్జాతీయ ఆరోగ్య అధ్యయనాలు సూచిస్తున్నాయి.

**100 డెసిబుల్స్ వద్ద 20 నిమిషాలే!**

శబ్దం ఎంత ఎక్కువగా ఉంటే దానికి గురయ్యే సురక్షిత సమయం అంత వేగంగా తగ్గిపోతుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔహూ) సురక్షిత వినికిడి మార్గదర్శకాల ప్రకారం 80 డెసిబుల్స్ శబ్దాన్ని వారానికి సుమారు 40 గంటల వరకు వినవచ్చు. 90 డెసిబుల్స్ వద్ద ఈ సమయం వారానికి నాలుగు గంటలకు తగ్గుతుంది. అదే 100 డెసిబుల్స్ వద్ద సురక్షిత వినికిడి సమయం వారానికి సుమారు 20 నిమిషాలకు పరిమితమవుతుంది. 110 డెసిబుల్స్ వద్ద అది కేవలం రెండున్నర నిమిషాల స్థాయికి పడిపోతుంది. అంటే శబ్ద తీవ్రత పెరిగే కొద్దీ ప్రమాదం కూడా వేగంగా పెరుగుతుందన్న మాట.

**చెవుల్లోని సున్నిత కణాలకు ముప్పు**

మన లోపలి చెవిలో శబ్ద తరంగాలను గుర్తించి వాటిని మెదడుకు సంకేతాలుగా పంపడంలో కీలక పాత్ర పోషించే అత్యంత సున్నితమైన ంవఅంశీతీఎ ష్ట్రుఱతీ ఎవశ్రీశ్రీం ఉంటాయి. ఎక్కువ శబ్దానికి పదేపదే లేదా ఎక్కువసేపు గురైతే ఈ కణాలు దెబ్బతినే ప్రమాదం ఉంది.

మొదట చెవులు మూసుకుపోయినట్లు అనిపించడం, శబ్దాలు స్పష్టంగా వినిపించకపోవడం లేదా చెవుల్లో ఈల, గంట మోగుతున్నట్లుగా అనిపించే 'టిన్నిటస్' రావచ్చు. అధిక శబ్దానికి నిరంతరం గురైతే శాశ్వత వినికిడి లోపం కూడా ఏర్పడవచ్చు.

**డ్యాన్స్‌తో పాటు డీహైడ్రేషన్**

నిమజ్జన ఊరేగింపుల్లో గంటల తరబడి నృత్యాలు చేయడం వల్ల శరీరం తీవ్రంగా అలసిపోతుంది. ఎండ, జనసమ్మర్దం, తగినంత నీరు తీసుకోకపోవడం వల్ల డీహైడ్రేషన్ కూడా ఏర్పడవచ్చు.

దీనికి అధిక శబ్దం, నిద్రలేమి, శారీరక శ్రమ తోడైతే శరీరంపై ఒత్తిడి మరింత పెరుగుతుంది.ఛాతిలో నొప్పి, తీవ్రమైన గుండెదడ, ఊపిరి తీసుకోవడంలో ఇబ్బంది, తల తిరగడం, అధిక చెమటలు, స్పృహ తప్పడం వంటి లక్షణాలు కనిపిస్తే వాటిని నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి.

# సాకులొద్దు.. సవరణల్లో సంక్షోభం

## 13 కోట్ల ఓట్ల తొలగింపుపై ప్రియాంక ప్రహారం

: ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మలాంటి ఎన్నికల ప్రక్రియలో తెరవెనుక కనీవినీ ఎరుగని వ్యూహం సాగుతోందా? పారదర్శకతకు నిలయమైన ఓటరు జాబితాలోనే లక్షలాది కాదు.. ఏకంగా కోట్ల సంఖ్యలో ఓట్లు గల్లంతయ్యాయా? ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ా×=) ప్రక్రియ వేదికగా విపక్షాలు సంధిస్తున్న ఈ అస్త్రాలు భారత రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయికుంటిసాకులతో సరిపెట్టలేరు: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను అడ్డం పెట్టుకుని దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను నిరంకుశంగా తొలగించారని కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ ధ్వజమెత్తారు. బీజేపీ పాతబడిన వాదనలతో కుంటిసాకులు చెప్పడం మానుకోవాలని మండిపడ్డారు. తమ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇప్పటికే పక్కా ఆధారాలను ప్రజల ముందుంచారని, ఎన్నికల్లో జోక్యం చేసుకోవడం ప్రజాస్వామ్య ద్రోహమే కాక తీవ్రమైన రాజ్యాంగ నేరమని నిలదీశారు.



సీఈసీపై చర్యల డిమాండ్: ఎన్నికల వ్యవస్థతో చెలగాటమాడే ఏ ఒక్కరికీ చట్టపరమైన రక్షణ ఉండకూడదని ప్రియాంక స్పష్టం చేశారు. ఎస్?ఐఆర్ నిబంధనల ఉల్లంఘనపై ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌ను చట్ట ప్రకారం ప్రాసిక్యూట్ చేయాలని, అవసరమైతే పార్లమెంట్‌లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టే అంశాన్ని పరిశీలిస్తామని




హెచ్చరించారు.

ఈసీఐ ప్రతిస్పందన: ఈ విమర్శలపై కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) స్పష్టతనిచ్చింది. ఓటర్ల జాబితా సవరణలన్నీ చట్టబద్ధమైన నిబంధనల మేరకే జరిగాయని తెలిపింది. ఎన్నికల కమిషనర్ల మధ్య చర్చోపచర్చలు సంస్థాగత ప్రక్రియలో భాగమేనని, నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని తేల్చిచెప్పింది.

# ఖైరతాబాద్ బడా గణేశుడికి ఘనమైన వీడ్కోలు



భాగ్యనగరం ఆధ్యాత్మిక సంద్రమైంది.. భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. శుక్రవారం ఎటు చూసినా గణనాథుల కోలాహలం.. జయజయ ధ్వానాలతో నగరం పులకించిపోయింది. ఖైరతాబాద్ బడా గణేశుడి విమహానిమజ్జన వేడుకలు అత్యంత వైభవంగా, ప్రశాంతంగా ముగిశాయి. ఈ ఏడాది 69 అడుగుల భారీ ఎత్తుతో కొలువుదీరిన 'పంచముఖ సంకటహర మహాగణపతి' హుస్సేన్‌సాగర్ గంగమ్మ ఒడికి చేరారు. భక్తుల జయజయధ్వానా మధ్య హుస్సేన్‌సాగర్‌లో ఎన్టీఆర్ మార్గ్ వైపు ఉన్న క్రేన్ నంబర్ 4 వద్ద బడా గణేశుడి నిమజ్జనం విజయవంతంగా పూర్తయింది.ఉదయం 9 : 30 గంటలకు ఖైరతాబాద్‌లో శోభాయాత్ర ప్రారంభమైంది. సెన్సేషన్ థియేటర్, రాజ్‌దూత్ చౌరస్తా, టెలిఫోన్ తెలంగాణ తల్లి చౌరస్తా, ఎన్టీఆర్ మార్గ్ మీదుగా ఈ శోభాయాత్ర కొనసాగింది. ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజల అనంతరం మధ్యాహ్నం 2:30 గంటలకు హుస్సేన్ సాగర్‌లో భారీ క్రేన్స్ సాయంతో నిమజ్జనం చేశారు.ప్రపంచ పటాలు పరిశీలించండి

ఖైరతాబాద్ గణనాథుడి చివరి రూపాన్ని చూసేందుకు, నిమజ్జన వేడుకను వీక్షించేందుకు రాష్ట్రాల నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు హుస్సేన్ సాగర్, ట్యాంక్ బండ్ పరిసరాలకు తరలివచ్చారు. నిమజ్జనం ప్రశాంతంగా ముగిసేందుకు వీలుగా హైదరాబాద్ పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ట్రాఫిక్ మళ్లింపులు చేపట్టడమే కాకుండా, ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం నిఘా పెట్టారు.

# సంస్కరణల సమరం

## ఐరాసను వాడుకుంటూ వంచిస్తున్నారు

## -- జైశంకర్ నిప్పులు



ప్రపంచ శాంతికి ప్రతీకగా నిలవాల్సిన ఐక్యరాజ్యసమితి (ఐరాస) కాలం చెల్లిన చట్రంలో బిగుసుకు పోయిందా? అంతర్జాతీయ పరిణామాలకు అనుగుణంగా మారాల్సిన అత్యున్నత వేదిక కేవలం కొందరి స్వార్థ ప్రయోజనాలకే పరిమితమైందా? ప్రపంచ దేశాల్లో దశాబ్దాలుగా రగులుతున్న అసంతృప్తి నిప్పు కణికలా మారుతున్న వేళ, భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయ దౌత్య వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి.మాటలకే పరిమితం.. చేతల్లో శూన్యం: న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి సాధారణ సభ 81వ సమావేశాల నేపథ్యంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సదస్సులో జైశంకర్ కుండబద్దలు కొట్టారు. ఐరాసలో నిర్మాణాత్మక సంస్కరణలు చేపట్టకపోవడం వల్ల అంతర్జాతీయ సమాజంలో తీవ్ర అసహనం పెరుగుతోందని స్పష్టం చేశారు. సంస్కరణలను అడ్డుకునే శక్తులకు ఐరాస భవిష్యత్తుపై నిజమైన శ్రద్ధ లేదని, వారు కేవలం తమ స్వప్రయోజనాల కోసం ఆ వేదికను సాధనంగా వాడుకుంటున్నారని దుయ్యబట్టారు.ముసాయిదా లేకుండా చర్చలు నిరర్థకం: సంస్కరణల పట్ల చిత్తశుద్ధి ఉంటే తక్షణమే ఒక నిర్దిష్ట లిఖితపూర్వక ముసాయిదా ఆధారంగా చర్చలు ప్రారంభించాలని తేల్చిచెప్పారు. ఎలాంటి ప్రతిపాదన పత్రం లేకుండా గాల్లో చర్చలు జరిపితే అది కాలయాపనకు తప్ప దేనికీ పనికిరాదని హెచ్చరించారు. ఏకాభిప్రాయం పేరుతో సంస్కరణలను తొక్కిపెట్టే ప్రయత్నాలు ఇక సాగవని, ప్రజాస్వామ్యబద్ధంగా నిర్ణయాలు తీసుకోవాలని ఉద్ఘాటించారు. మారుతున్న ప్రపంచ ముఖచిత్రానికి అద్దంపట్టేలా భద్రతా మండలి సమూలంగా రూపాంతరం చెందకపోతే ఐరాస ప్రాసంగికతకే ముప్పు వాటిల్లుతుందన్న భారత్ గళం ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా బలమైన మద్దతు కూడగట్టుకుంటోంది.

# ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఈడీ సమన్లు..

## సెప్టెంబర్ 27న హాజరు కావాలని ఆదేశం



శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీకి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. సాహితి ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. సెప్టెంబర్ 27న ఈడీ ఎదుట హాజరుకావాలని సమన్లలో పేర్కొన్నట్లు సమాచారం.సాహితి ఇన్‌ఫ్రాటెక్ ప్రాజెక్టుల పేరుతో కొనుగోలుదారుల నుంచి భారీగా నిధులు సేకరించి మోసం చేశారనే ఆరోపణలపై తెలంగాణ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద దర్యాప్తు చేపట్టిందిసాహితి ఇన్‌ఫ్రాటెక్ ప్రాజెక్టుల్లో తొలుత సుమారు రూ.248 కోట్ల మేర మోసం జరిగినట్లు ఆరోపణలు వచ్చాయి. తదుపరి దర్యాప్తులో ఈ మొత్తం సుమారు రూ.842 కోట్లకు చేరినట్లు ఈడీ అంచనా వేసింది. ఫ్లాట్లు, విల్లాలు నిర్మించి ఇస్తామని చెప్పి ప్రీ-లాంచ్ ఆఫర్ల పేరుతో కొనుగోలుదారుల నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు సేకరించినట్లు దర్యాప్తు సంస్థ ఆరోపిస్తోంది.సేకరించిన నిధుల్లో కొంత మొత్తాన్ని సంస్థకు సంబంధించిన వ్యక్తిగత, కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలకు మళ్లించినట్లు ఈడీ దర్యాప్తులో గుర్తించినట్లు పేర్కొంది. దాదాపు రూ.126 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయని తెలిపింది.

**ఎమ్మెల్యే ఖాతాల ద్వారా రూ.2.1 కోట్ల లావాదేవీలపై ఆరా**

ఈ కేసులో అరికెపూడి గాంధీకి సంబంధించిన బ్యాంకు ఖాతాల ద్వారా సాహితి ఇన్‌ఫ్రా నుంచి సుమారు రూ.2.1 కోట్లు బదిలీ అయినట్లు ఈడీ గుర్తించినట్లు పేర్కొంది. ఈ లావాదేవీల స్వభావం, ఉద్దేశం, వాటికి సంబంధించిన ఆర్థిక సంబంధాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. మనీలాండరింగ్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తున్న ఆస్తులు, లావాదేవీలపైనా ఈడీ దృష్టి సారించింది.దర్యాప్తులో భాగంగా ఇప్పటివరకు 56 బ్యాంకు ఖాతాలను ఫ్రీజ్ చేసినట్లు ఈడీ పేర్కొంది. గతంలో సుమారు రూ.161 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసిన అధికారులు, మరో విడతలో రూ.12.6 కోట్ల విలువైన ఆస్తులను కూడా అటాచ్ చేసినట్లు వెల్లడించారు. బినామీ పేర్లతో ఆస్తులు కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో గుర్తించినట్లు ఈడీ ఆరోపిస్తోంది.

సాహితి ఇన్‌ఫ్రా ఎండీ అరెస్టుసాహితి ఇన్‌ఫ్రాటెక్ కేసులో సంస్థ ఎండీ బి. లక్ష్మీనారాయణ, మాజీ డైరెక్టర్ సందు పూర్ణచంద్రరావు తదితరులపై దర్యాప్తు కొనసాగుతోంది. సంస్థ ఎండీ బి. లక్ష్మీనారాయణను 2024 సెప్టెంబర్‌లో ఈడీ అరెస్టు చేసింది. సాహితి ఇన్‌ఫ్రా ప్రాజెక్టులకు సంబంధించిన ప్రకటనల్లో కనిపించిన నటుడు జగపతిబాబును కూడా ఈడీ గతంలో సాక్షిగా విచారించినట్లు అధికారులు వెల్లడించారు.

# సిక్కింలో వరద బీభత్సం..

## కొండచరియలు విరిగిపడి కూలిన ఇళ్లు




సిక్కిం, సిక్కింలో వరదలు బీభత్సం సృష్టించాయి. గురువారం రాత్రి పలు ప్రాంతాల్లో కురిసిన భీకర వర్షాలకు వరదలు వచ్చాయి. వర్షాలకు వెస్ట్ సిక్కింలోని యుక్సోం-తషిడింగ్ పరిధిలోని రింబి గ్రామంలో కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. దాంతోపాటు ఇళ్ల శకలాలు, బురదతో కూడిన వరద లోతట్టు ప్రాంతాల్లోకి ప్రవహించింది. దీంతో వాహనాల రాకపోకలు కూడా స్తంభించిపోయాయి. అయితే, కొండచరియలు విరిగిపడిన ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని అధికారులు తెలిపారు. మరికొద్ది రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

అలాగే, రాజధాని గ్యాంగ్‌టక్‌లోనూ భారీ వర్షాలు కురిశాయి. లోతట్టు ప్రాంతాలు మునిగిపోయాయి. కొండచరియలు విరిగిపడ్డాయి. బురదతో కూడిన వరద రోడ్లపై ప్రవహించడంతో వాహనాలు రాకపోకలు నిలిచిపోయాయి. కాగా.. కొండచరియలు విరిగిపడిన ప్రాంతాల్లో జరిగిన నష్టాన్ని గ్యాంగ్‌టక్ జిల్లా విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థ (డీడీఎంఏ) అధికారులు అంచనా వేస్తున్నారు. గురువారం రింబి గ్రామంలో వారు పర్యటించారు. ఇళు డ్యామేజ్ అయిన బాధితులతో మాట్లాడారు. అలాగే బోజోగ్‌హరి సమీపంలోని లూయింగ్-రంకా హైవే, లింగ్‌డింగ్, హైకోర్ట్ రోడ్, టీఎన్ఏ గేట్, వీఐపీ కాలనీ, పంగ్‌థాంగ్-లింగ్‌డాక్ రోడ్, పమ్రో గాన్, ఫెన్‌జాంగ్ తదితర ప్రాంతాలను కూడా పరిశీలించారు.

**స్తంభించిన రోడ్డు రవాణా**

కొండచరియలు, వరదల కారణంగా వెస్ట్ సిక్కింలోని పలు ప్రాంతాల్లో రోడ్డు రవాణా స్తంభించిపోయింది. అలాగే సిచీలోని సివేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ప్రజా మౌలిక సదుపాయాలకూ నష్టం వాటిల్లింది. ఎంచెయ్ స్కూల్ వద్ద బురద పేరుకుపోయింది. ముందుజాగ్రత్త చర్యగా వర్షపు నీరు రాకుండా కొన్ని చోట్ల టార్పాలిన్ కవర్లు ఏర్పాటు చేశారు. రోడ్లపై బురద, శకలాలను సాధ్యమైనంత త్వరగా తొలగించాలని అధికారులను జిల్లా కలెక్టర్,
డీడీఎంఏ చైర్మన్ ఆదేశించారు. బాధిత ప్రజలకు అవసరమైన సహాయం చేయాలని సూచించారు. అలాగే కొండచరియలు విరిగిపడేందుకు అవకాశం ఉన్న ప్రాంతాల వైపు వెళ్లకూడదని ప్రజలను అధికారులు హెచ్చరించారు. ముఖ్యంగా రాత్రిపూట ప్రయాణాలు మానుకోవాలని సూచించారు.

# వైసీపీకి యనమల కృష్ణుడు రాజీనామా..

## పవన్ సమక్షంలో జనసేనలో చేరిక

కాకినాడ, సెప్టెంబర్ 25: స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగనున్న వేళ.. వైసీపీలో నేతల రాజీనామా పర్వం కొనసాగుతోంది. తాజాగా కాకినాడ జిల్లా తుని నియోజకవర్గంలో కీలక పరిణామం చోటు చేసుకుంది. వైసీపీకి యనమల కృష్ణుడు రాజీనామా చేశారు. అనంతరం జనసేన పార్టీలో ఆయన చేరారు. శుక్రవారం రాజధాని అమరావతిలోని జనసేన కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సమక్షంలో యనమల కృష్ణుడు చేరారు. ఆయనకు కండువా కప్పి.. పార్టీలోకి పవన్ కల్యాణ్ ఆహ్వానించారు. 2024 ఎన్నికల్లో యనమల కృష్ణుడికి టీడీపీ టిక్కెట్ దక్కలేదు. ఈ నేపథ్యంలో ఆయన వైసీపీలో చేరారు. టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడి సోదరుడే కృష్ణుడు.

గత మూడు రోజులుగా వైసీపీలో రాజీనామాలు జోరందుకున్నాయి. నిన్న (గురువారం) నంద్యాలలో మాజీ సర్పంచ్‌తోపాటు దాదాపు 200 మంది నేతలు, కార్యకర్తలు వైసీపీకి రాజీనామా చేశారు. అనంతరం వారంతా మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ సమక్షంలో టీడీపీలో చేరారు. అలాగే మొన్న (బుధవారం) విజయనగరం జిల్లాలో వైసీపీకి చెందిన పలువురు జడ్పీటీసీలు.. ఆ పార్టీకి రాజీనామా చేశారు.అనంతరం వారంతా టీడీపీలో చేరారు. వీరంతా విజయనగరం జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అనుచరులు. జిల్లాలోని పలువురు నేతలతోపాటు కేడర్.. వైసీపీకి గుడ్ బై చెప్పేందుకు సిద్ధమవుతున్నట్లు ఓ చర్చ సాగుతోంది. వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణకు మజ్జి శ్రీనివాసరావు సమీప బంధువు. వైసీపీకి ఆయన రాజీనామా చేయడంతో విజయనగరం జిల్లాలో పార్టీ పరిస్థితిని అంచనా వేసేందుకు అగ్రనాయకత్వం సిద్ధమవుతున్నట్లు ఓ ప్రచారం సాగుతోంది.

# బాలాపూర్ గణేశ్ లడ్డూకు రికార్డు ధర..

## రూ.39 లక్షలకు దక్కించుకున్న సామ ప్రణీత్ రెడ్డి!

ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న బాలాపూర్ గణేశ్ లడ్డూ వేలం పాట ముగిసింది. ఈసారి లడ్డూకు భారీగా పోటీ నెలకొనగా.. సామ ప్రణీత్ రెడ్డి అత్యధికంగా రూ.39 లక్షలు చెల్లించి లడ్డూను దక్కించుకున్నారు. దీంతో బాలాపూర్ లడ్డూ వేలంలో మరోసారి భారీ ధర నమోదైందిబాలాపూర్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన వేలం పాట రూ.1,116 ప్రారంభ ధరతో మొదలైంది. ఈ ఏడాది లడ్డూ వేలం కోసం మొత్తం తొమ్మిది మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో ఐదు కంపెనీల ప్రతినిధులు ఉండటంతో వేలంలో పోటీ మరింత పెరిగింది. లడ్డూ కోసం కంపెనీలు కూడా బరిలోకి రావడం ఈసారి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చివరకు సామ ప్రణీత్ రెడ్డి రూ.39 లక్షలకు లడ్డూను సొంతం చేసుకున్నారు. గతేడాది బాలాపూర్ గణేశ్ లడ్డూ రూ.35.70 లక్షలకు విక్రయమైంది. ఈసారి రూ.39 లక్షలకు చేరడంతో గతేడాది కంటే రూ.3.30 లక్షలు అధికంగా ధర పలకడం గమనార్హం.లడ్డూ వేలం ప్రారంభానికి ముందే బాలాపూర్‌లో సందడి నెలకొంది. వేలం పాటను ప్రత్యక్షంగా వీక్షించేందుకు గ్రామస్థులు, భక్తులు భారీగా తరలివచ్చారు. దీంతో వేలం ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఇక బాలాపూర్ గణేశ్ నిమజ్జన శోభాయాత్ర, లడ్డూ వేలం నేపథ్యంలో పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. సుమారు 400 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్, షీ టీమ్స్, టాస్క్‌ఫోర్స్ సిబ్బందిని విధుల్లో ఉంచారు.

## వ్యర్థాల వేరు చేయడంపై ఇంటింటి అవగాహన

**తుమ్మనపల్లిలో 'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమం**
**నాలుగు రకాలుగా చెత్తను వేరు చేసి అందించాలని సూచన**
**పరిశుభ్రమైన గ్రామ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపు**







హుజురాబాద్,
'స్వచ్ఛతా హి సేవా' కార్యక్రమంలో భాగంగా హుజురాబాద్ మండలం తుమ్మనపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో బుధవారం వ్యర్థాల వేరు చేయడంపై ఇంటింటి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి ఇంటిని సందర్శించి గృహాల నుంచి వెలువడే వ్యర్థాలను సక్రమంగా వేరు చేయడం, గ్రామంలో పరిశుభ్రతను కాపాడుకోవడం, పరిసరాలను స్వచ్ఛంగా ఉంచుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటి నుంచి వచ్చే చెత్తను తడి వ్యర్థాలు, పొడి వ్యర్థాలు, శానిటరీ వ్యర్థాలు, ప్రత్యేక శ్రద్ధ అవసరమైన వ్యర్థాలుగా నాలుగు రకాలుగా వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని సూచించారు. వ్యర్థాలను ఎక్కడపడితే అక్కడ వేయకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.
పరిశుభ్రత అనేది కేవలం పారిశుధ్య సిబ్బంది బాధ్యత మాత్రమే కాదని, గ్రామంలోని ప్రతి కుటుంబం భాగస్వామ్యం కావాలని అవగాహన కల్పించారు. ఇంటి నుంచే వ్యర్థాలను వేరు చేయడం అలవాటుగా మార్చుకుంటే చెత్త నిర్వహణ సులభమవడంతో పాటు పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన గ్రామాన్ని నిర్మించుకోవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, టెక్నికల్ అసిస్టెంట్ (టీఏ), ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, యువత, పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## ఇంటిలో తయారు చేసుకున్న ఆహార పదార్థాలను పిల్లలకు ఇవ్వాలి.

– సిడిపిఓ ప్రేమలత.





గోవిందరావుపేట, తల్లిదండ్రులు ఇంటిలో తయారుచేసిన ఆహార పదార్థాలు పిల్లలకు తినిపించాలని సిడిపిఓ ప్రేమలత అన్నారు, గురువారం తాడ్వాయి ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పస్రా సెక్టార్లోని ,పస్రా–4వ అంగన్వాడి కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమం నిర్వహించడం జరిగిందిఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిడిపిఓ ప్రేమలత హాజరైతల్లులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూతక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాహారం లభించే ఆహార పదార్థాలు తీసుకోవాలని, గర్భస్థ దశ నుండి 2సం పిల్లల వరకు(1000)రోజుల (ప్రాముఖ్యత), 3సం -6సం వరకు అంగన్వాడి కేంద్రానికి హాజరయ్యే ప్రీస్కూల్ పిల్లలకి ఇస్తున్న పౌష్టికాహారం పై అవగాహన కల్పించారు, శరీరానికి హాని కల్గించే ఆహార పదార్థాలు తినకూడదనిఇంట్లో తయారు చేసుకున్న తినుబండారాలను అందించాలన్నారు,పిల్లలకు స్నాక్స్ ,బిస్కెట్స్, చిప్స్ ,కూల్ డ్రింక్స్ లాంటివి తినిపించకూడదని, తల్లులు పిల్లల కోసం ప్రత్యేకంగా ఇంట్లో స్నాక్స్ తయారుచేసి ఇవ్వాలని అంగన్వాడికి మూడు సంవత్సరాల నుండి పిల్లలను పంపించాలని ఆమె సూచించారు, పిల్లలకు మరియు గర్భిణీ బాలింతలకు, అంగన్వాడీ కేంద్రంలో ఇస్తున్న పౌష్టికాహారం, ఒక్కపూట భోజనం ,పాలు ,గుడ్లు, కురుకురే, బాలామృతం తీసుకుని ఆరోగ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. సామ్. మామ్ పిల్లలకు ఇచ్చే బాలామృతం తప్పకుండా తినిపించాలని కోరారు. అన్ని రకాల పౌష్టికాహారం లభించే ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు, గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరూ అంగన్వాడీ కేంద్రాన్ని
" మన అంగన్వాడీ- మన బాధ్యతగా'భావించాలని సరైన పౌష్టికాహారం తీసుకుని అందరూ మంచి ఆరోగ్యాన్ని కలిగి ఉండాలని తెలియజేశారు. తల్లులందరూ వారు పాటిస్తున్న పౌష్టికాహార బెస్ట్ మంచి అలవాట్లను పంచుకోనైనది,ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్వైజర్ శారద, అంగన్వాడి టీచర్ పద్మరాణి, ఆయా రాజ్యం, ఆశ వర్కర్ శ్యామల, మరియు తల్లులందరూ పాల్గొన్నారు,

## ధాన్యం కొనుగోళ్లకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి..



నిజామాబాద్: ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్ల కోసం క్షేత్రస్థాయిలో అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ భవేష్ మిశ్రా ఆదేశించారు.
అక్టోబర్ 1 నుండి జిల్లాలో కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణకు శ్రీకారం చుడతామని అన్నారు. ఈ నేపథ్యంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా, అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.
సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్ లో,వివిధ శాఖల జిల్లా అధికారులతో కలిసి కలెక్టర్ అన్ని మండలాల తహసీల్దార్లు ఎంపీడీఓలతో కీలక అంశాలపై సమీక్ష జరిపారు.
ధాన్యం అమ్మకాల విషయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగానే పకడ్బందీ కార్యాచరణతో సన్నద్ధం కావాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో సదుపాయాల కల్పనతో పాటు, రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని నిల్వ చేసేందుకు గుర్తించిన గిడ్డంగులు,ఫంక్షన్ హాళు ,,ఆయా ప్రదేశాలను క్షేత్రస్థాయిలో సందర్శించాలని ఆదేశించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ నిర్ణీత గడువు కంటే ముందే పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నిబంధనలకు అనుగుణంగా విధులు నిర్వర్తించని వారిపై చర్యలు తప్పవని అన్నారు. మ్యాపింగ్ కాని వారికి,పేర్లు ఇతర వివరాలలో వ్యత్యాసం ఉన్న వారికి ఇంకనూ నోటీసులు జారీ చేయకపోతే తక్షణమే అందించాలని,నోటీసులు ఇచ్చిన వారి హియరింగ్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.
భూభారతి పెండింగ్ దరఖాస్తుల ప్రగతిని మండలాల వారీగా సమీక్షించిన కలెక్టర్,వచ్చే వారం నాటికి ఏ ఒక్క అర్జీ కూడా పెండింగ్ లో ఉండకుండా అన్నింటినీ పరిష్కరించాలని గడువు విధించారు. తహసిల్దార్,ఆర్డీఓ లాగిన్లలోని అన్ని మాడ్యుల్స్ కు సంబంధించిన దరఖాస్తులను నిశితంగా పరిశీలిస్తూ, భూభారతి నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. హౌసింగ్ శాఖ పనితీరును సమీక్షిస్తూ,మొదటి విడతలో మంజూరు చేసిన ఇందిరమ్మ పెండింగ్ ఇళ్ళ నిర్మాణాలు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసేలా లబ్దిదారులను ప్రోత్సహించాలని అన్నారు. రెండవ విడత మంజూరీలను వేగవంతం చేయాలని సూచించారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపు ఈ నెలాఖరు నాటికి పూర్తి కావాలని అన్నారు. 8274 డబుల్ బెడ్ రూమ్ లు పూర్తి కాగా,ఇప్పటికే వాటిలో 6713 ఇళ్ళ కేటాయింపులు పూర్తయ్యాయని,మిగిలిన 1561 ఇళ్ళను కూడా వారం వ్యవధిలో లబ్దిదారులకు లాటరీ పద్ధతిన, నిబంధనలను అనుసరిస్తూ పూర్తి పారదర్శకంగా కేటాయింపులు జరపాలని కలెక్టర్ ఆదేశించారు.

**మైనారిటీ సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందించాలి.**

మైనారిటీల అభ్యున్నతిని కాంక్షిస్తూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలలో అవగాహన పెంపొందించేందుకు విస్తృత చర్యలు చేపట్టాలని కలెక్టర్ భవేష్ మిశ్రా సూచించారు. మైనారిటీ సంక్షేమ శాఖ రాష్ట్ర కమిషనర్ అబ్దుల్ హమీద్ తో కలిసి అధికారులతో సమీక్ష నిర్వహించారు. షాదీ ముబారక్ పథకం కింద జిల్లాకు 19.98 కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వం కేటాయించగా,7.79 కోట్లు మాత్రమే ఇప్పటివరకు పంపిణీ జరిగిందన్నారు.ఇతర సంక్షేమ పథకాల విషయంలోనూ ఆశించిన స్థాయిలో స్పందన కనిపించడం లేదన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వివిధ పథకాల గురించి క్షేత్రస్థాయిలో ముమ్మర ప్రచారం నిర్వహిస్తూ ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు.తద్వారా అర్హులైన ప్రతి ఒక్కరు పతకాలను సద్వినియోగం చేసుకునేలా, ప్రభుత్వ తోడ్పాటుతో లబ్ది పొందేలా చొరవ చూపాలని కలెక్టర్ హితవు పలికారు. లబ్దిదారుల ఎంపిక విషయంలోనూ అధికారులు జాప్యం చేయకుండా దరఖాస్తులను వెంటదివెంట పరిశీలిస్తూ అర్హత కలిగిన వారికి ఆమోదం తెలుపాలని సూచించారు. ఈ సమావేశంలో,అదనపు కలెక్టర్ వి.భుజంగరావు,ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిగ్యాన్ మాల్వియ, ట్రైనీ కలెక్టర్ సురేష్,డీ.ఆర్.ఓ గీత,నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, ఆర్డీఓలు రాజేంద్రకుమార్, విజయ కుమారి,డీ.ఆర్.డీ.ఓ సాయన్న,సంబంధిత శాఖల అధికారులు,అన్ని మండలాల తహసిల్దార్లు,ఎంపీడీఓలు, మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు పాల్గొన్నారు.

## చిన్నవడ్డేపల్లి చెరువులో ఘనంగా వినాయక నిమజ్జనోత్సవం

**కొబ్బరికాయలు కొట్టి నిమజ్జన వేడుకలను ప్రారంభించిన కుడా చైర్‌పర్సన్, ఇరు జిల్లాల కలెక్టర్లు**
**సుమారు 2,500 విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు**
**ప్రశాంత వాతావరణంలో గణనాథుడికి భక్తుల ఘన వీడ్కోలు**



వరంగల్,
వరంగల్ నగరంలోని చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద బుధవారం వినాయక నిమజ్జనోత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ప్రారంభమయ్యాయి. గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత కొబ్బరికాయలు కొట్టి నిమజ్జన కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు.
ఈ సందర్భంగా అధికారులు క్రేన్ సహాయంతో చెరువులో ఏర్పాటు చేసిన ప్రత్యేక నీటితెప్పలపైకి చేరుకుని గణపతి విగ్రహాలను స్వయంగా నిమజ్జనం చేశారు. అనంతరం నిమజ్జన ప్రక్రియను పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

**2,500 విగ్రహాల నిమజ్జనానికి ఏర్పాట్లు**

ఈ సందర్భంగా కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి మాట్లాడుతూ చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద వినాయక నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి సుమారు 2,500 గణపతి విగ్రహాలు ఈ చెరువుకు నిమజ్జనం కోసం రానున్నాయని వెల్లడించారు.
కుడా పరిధిలోని అన్ని నిమజ్జన కేంద్రాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అవసరమైన సదుపాయాలు కల్పించినట్లు వివరించారు. నిమజ్జన కార్యక్రమాలను సజావుగా నిర్వహించేందుకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

**భజనలు, కోలాటాలు, డప్పు వాయిద్యాలతో సందడి**

వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన గణనాథుడి విగ్రహాలను భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. భజనలు, కోలాటాలు, డప్పు వాయిద్యాల నడుమ గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు.న్నవడ్డేపల్లి చెరువు వద్దకు చేరుకున్న విగ్రహాలను క్రేన్ల సహాయంతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన తెప్పల ద్వారా చెరువులో నిమజ్జనం చేశారు.

**భద్రత, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి**

నిమజ్జనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. చెరువు పరిసరాల్లో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుధ్యం, తాగునీరు తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచారు.
పోలీస్, రెవెన్యూ, జీడబ్ల్యూఎంసీ, కుడా, విద్యుత్, నీటిపారుదల, మత్స్య, ఆర్అండ్‌బీ, అగ్నిమాపక శాఖల అధికారులు సమన్వయంతో విధులు నిర్వహిస్తున్నారు. నిమజ్జన కార్యక్రమాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు కృషి చేస్తున్న వివిధ శాఖల అధికారులను, సిబ్బందిని కుడా చైర్‌పర్సన్ గుండు సుధారాణి అభినందించారు.

**భక్తుల సహకారంతో ప్రశాంతంగా నిమజ్జనం**

నిమజ్జన కేంద్రాల్లో అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపడుతున్నారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో గణనాథుడికి వీడ్కోలు పలికేలా ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. నిమజ్జన కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుపేదల సంక్షేమమే ప్రధాన లక్ష్యం

**-కాంగ్రెస్ నాయకులు సాయి ఓంకార్ గౌడ్..**



అభ్యుదయం– హైదరాబాద్ (సెప్టెంబర్ 24): నిరుపేదల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని కాంగ్రెస్ నాయకుడు తాళ్లపల్లి సాయి ఓంకార్ గౌడ్ అన్నారు. గురువారం, మలక్ పెట్ నందు ఆస్మాన్ ఘడ్ డివిజన్ నందు, ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేసి, నిరుపేదలకు కళ్ళజోళ్ళు పంపిణీ చేశారు. అనంతరం సాయి ఓంకార్ గౌడ్ మాట్లాడుతూ, మారుతున్న జీవనశైలి వల్ల వస్తున్న అనారోగ్య సమస్యల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం వల్ల నిరుపేదలకు ఆర్థిక భారం తగ్గుతుందని అన్నారు. నిరుపేదల అభ్యున్నతికి నిరంతరం శ్రామిస్తానని అన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సాయి ఓంకార్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో, బీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామకృష్ణ గౌడ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ అశ్వక్ ఖాన్, సీనియర్ నాయకుడు బాబు శ్రీనివాస్ సురేందర్ రెడ్డి, సంగి రెడ్డి డి శ్రీనివాస్ యూత్ కాంగ్రెస్ నాయకులు సోహైల్,
గోపాల్ శ్రీనివాస్ శంకర్ నర్సింగ్, ముసారంబాగ్ డివిజన్ అధ్యక్షుడు సాయి ధర్మేంధర్, రాజు రాము తదితరులు పాల్గొన్నారు.

# అక్టోబర్ 25 నుంచి హ్యామ్ రోడ్ల పనులు ప్రారంభం

- మూడు విడతల్లో 18,472 కి.మీ. గ్రామీణ రహదారుల అభివృద్ధి
- తొలి విడతలో 7,448 కి.మీ. రోడ్లకు ప్రణాళిక
- 3 వేల గ్రామ పంచాయతీల పరిధిలో పనులు
- 15 ఏళ్లపాటు నిర్వహణ బాధ్యత కాంట్రాక్టర్లదే
- మంత్రి ధనసరి అనసూయ సీతక్క






వరంగల్ రాష్ట్రంలో గ్రామీణ రహదారుల రూపురేఖలు మార్చే లక్ష్యంతో చేపట్టిన హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హ్యామ్) రోడ్ల పనులను అక్టోబర్ 25 నుంచి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు.

ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలకు సంబంధించిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం చేపడుతున్న హ్యామ్ రోడ్ల పురోగతి, పనుల ప్రారంభంపై సమావేశంలో విస్తృతంగా చర్చించినట్లు వెల్లడించారు.

మూడు విడతల్లో మొత్తం 18,472 కిలోమీటర్ల గ్రామీణ రహదారులను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ప్రణాళిక రూపొందించిందని తెలిపారు. ఇందులో తొలి విడతలో 7,448 కిలోమీటర్ల మేర రోడ్ల పనులు చేపట్టనున్నట్లు చెప్పారు. సుమారు మూడు వేల గ్రామ పంచాయతీల పరిధిలో ఈ కార్యక్రమాన్ని అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

హ్యామ్ విధానంలో నిర్మించే రహదారుల నిర్వహణ బాధ్యతను కూడా 15 సంవత్సరాలపాటు సంబంధిత కాంట్రాక్ట్ ఏజెన్సీలే చూసుకునేలా ప్రణాళిక రూపొందించినట్లు సీతక్క తెలిపారు. పనులను ఎప్పటి నుంచి ప్రారంభించాలనే అంశంపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేసినట్లు చెప్పారు.

ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాలకు సంబంధించిన కాంట్రాక్ట్ ఏజెన్సీలు అక్టోబర్ 25 నుంచి కొన్ని పనులు, నవంబర్ మొదటి వారం నుంచి మరికొన్ని పనులు ప్రారంభించాలని ఆదేశించినట్లు వెల్లడించారు.

గ్రామీణ ప్రాంతాల్లో రహదారి సౌకర్యం లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హ్యామ్ ప్రాజెక్టును చేపట్టారని సీతక్క తెలిపారు. ప్రతి ఆవాసం నుంచి గ్రామ పంచాయతీకి, గ్రామ పంచాయతీ నుంచి మండల కేంద్రానికి తప్పనిసరిగా రహదారి అనుసంధానం ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు.

హ్యామ్ రోడ్లపై దాదాపు ఏడాది కాలంగా చర్చలు, ప్రణాళికలు కొనసాగుతున్నాయని చెప్పారు. ములుగులో హ్యామ్ రోడ్లకు సంబంధించిన పైలాన్‌ను గత నెల 16న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆవిష్కరించారని గుర్తు చేశారు. అక్టోబర్ 25 నుంచి పనులు ప్రారంభించేలా సంబంధిత అధికారులు, ఏజెన్సీలకు ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు.

రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావంపై అసెంబ్లీలోనూ చర్చించినట్లు సీతక్క పేర్కొన్నారు. ఎల్‌నినో పరిస్థితులను ఏ విధంగా ఎదుర్కోవాలనే అంశంపై చర్చించి, అవసరమైన తీర్మానాలు కూడా చేసినట్లు ఆమె తెలిపారు.

# ఉత్తమ విద్యార్థులకు శ్రీరామ్ గ్రూప్ చేయూత..!

**ప్రభుత్వ విద్యకు నగదు ప్రోత్సాహం**

సంగారెడ్డి ప్రతినిధి, సెప్టెంబర్ 25
పేదరికాన్ని జయించి విద్యలో ప్రతిభ కనబరిచిన జిల్లా పరిషత్తు హై స్కూల్ మల్కాపూర్, కొండాపూర్ మండలంకు చెందిన విద్యార్థిని ఎ. వర్షితకి శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ రూ.5 లక్షల నగదు ప్రోత్సాహకాన్ని అందించింది.
ఇటీవల నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి 10 వ తరగతి పరీక్షలో 594 మార్కులు సాధించి విశేష ప్రతిభ కనబరిచింది.
ఆమెతో పాటు మరో విద్యార్థిని కె. మౌనిక కూడా 592 మార్కులు సాధించగా.. రూ.3 లక్షల ప్రోత్సాహకాన్ని శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రకటించింది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ తరఫున ఈ నగదు ప్రోత్సాహకాలను గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల అందజేశారు.
ఆర్థిక ఇబ్బందులను అధిగమించి కష్టపడి చదివి విజయం సాధించిన విద్యార్థులను శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో మరింత కృషి చేసి సమాజానికి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ క్యాషి,
శ్రీరామ్ ఫైనాన్స్ ఎం డి
ప్రవీణ్ ,శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఇండియా మార్కెటింగ్ మేనేజర్ వరుణ్ కిషోర్, శ్రీరామ్ లైఫ్ తెలంగాణ రాష్ట్ర



ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీనివాస రెడ్డి, హైదరాబాద్ జోనల్ మేనేజర్ నరేందర్ , సంగారెడ్డి డివిజన్ ఏజీఎం విజయ్ , బ్రాంచ్ మేనేజర్ ప్రవీణ్ , స్థానిక మల్కాపూర్ పాఠశాల హెడ్మాస్టర్ యాదగిరి , ఉపసర్పంచ్ ప్రవీణ్ పాల్గొన్నారు.

# ఎలుకలు కొరికితే మీరేం చేస్తున్నరు?.

**రేవంత్ పాలనలో విద్య నిర్వీర్యం**
**పాలకుర్తి గురుకుల విద్యార్థినులను ఎలుకలు కొరుకడంపై మండిపాటు**
**గురుకులంలోకి అనుమతించకపోవడంతో అక్కడే బైఠాయించి ధర్నా**
**ఘటనపై కలెక్టర్, గురుకులాల కార్యదర్శికి ఫోన్‌లో ఫిర్యాదు**

పాలకుర్తి, సెప్టెంబర్ 25 : 'గురుకులాలను ఇంత అధ్వానంగా నడుపుతారా? విద్యార్థినులను ఎలుకలు కొరికేంత పరిస్థితి వచ్చే వరకు మీరేం చేస్తున్నారు' అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు గురుకులం నిర్వాహకులను ప్రశ్నించారు. గురుకులాలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్రంలోని గురుకుల పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు కనీస భద్రత కల్పించకపోవడం సిగ్గుచేటని అన్నారు. రేవంత్‌రెడ్డి మూడేండ్ల పాలనలో రాష్ట్రంలో విద్యారంగం భ్రష్టుపట్టిపోయిందని ధ్వజమెత్తారు. జనగామ జిల్లా పాలకుర్తిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల పాఠశాలలో 14 మంది విద్యార్థినులను ఎలుకలు కొరికిన నేపథ్యంలో శుక్రవారం ఎర్రబెల్లి బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పేందుకు పాఠశాలకు వచ్చారు.
ఈ క్రమంలో పాఠశాల గేట్ వద్ద సీఐ భరత్ సుమన్, ఎస్సై దూలం పవన్‌కుమార్ పోలీసు సిబ్బందితో అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లికి పోలీసులకు మధ్య వాగ్వాదం చోటుచేసుకున్నది. ఎర్రబెల్లి వెంటనే గురుకులాల సొసైటీ కార్యదర్శితోపాటు కలెక్టర్‌కు ఫోన్ చేసి జరిగిన ఘటనను వివరించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురుకుల పాఠశాలలోకి అనుమతించకపోవడంతో పాఠశాల గేటు ఎదుట బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఎర్రబెల్లి మాట్లాడుతూ.. పోలీసులను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ ప్రభుత్వం పాలన చేస్తున్నదని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో దొంగల పాలన నడుస్తున్నదని దుయ్యబట్టారు. ప్రభుత్వం, అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థినుల జీవితాలు అయోమయంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థినులను ఎలుకలు కొరికినా స్థానిక ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి పట్టించుకోకపోవడం బాధాకరమని అన్నారు. ఈ ఘటనలో నిర్లక్ష్యం చేసిన అధికారులపై తక్షణమే చర్యలు



తీసుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు రాష్ట్రంలో రైతాంగానికి నాణ్యమైన విద్యుత్తు అందడం లేదని పేర్కొన్నారు. 24 గంటల కరెంట్ మాట దేవుడెరుగు.. కనీసం 6 గంటల కరెంట్ కూడా ఇవ్వని దుస్థితి నెలకొన్నదని విమర్శించారు. పాలకుర్తి నియోజకవర్గంలో గోదావరి జలాలు పారకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. 22ఏ పేరుతో పేదల భూములను సర్కార్ గుంజుకుంటున్నదని ఆరోపించారు. తన 45 ఏండ్ల రాజకీయ జీవితంలో ఇంతటి దుర్మార్గమైన సీఎంను చూడలేదని అన్నారు.

# అనుభవదారు హకుదారు కాలేడు

**యాజమాన్య హకులను సివిల్ కోర్టులోనే తేల్చుకోవాలి**
**రామలింగేశ్వరస్వామి ఆలయ భూములపై హైకోర్టు తీర్పు**

హైదరాబాద్, సెప్టెంబర్ 25 : రెవెన్యూ రికార్డుల్లో అనుభవదారుగా నమోదైనంత మాత్రాన భూమిపై యాజమాన్య హకులు లభించవని హైకోర్టు స్పష్టం చేసింది. అధికారిక నివేదికలు, అఫిడవిట్ల ఆధారంగా యాజమాన్య హకులను నిర్ధారించలేమని, యాజమాన్య హకులను తేల్చాల్సింది సివిల్ కోర్టు మాత్రమేనని పేరొన్నది. యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం చినరావల్పల్లిలోని వివిధ సర్వే నంబర్లలో శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయానికి చెందిన 40 ఎకరాల భూములపై దేవాదాయ శాఖ ట్రిబ్యునల్ ఉత్తర్వులను సవాలు చేస్తూ హరికీర్తి ఆంజనేయులు, మరో ఇద్దరు దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ జీఎం మొహియుద్దీన్ విచారణ జరిపారు. ప్రపంచ పటాలు పరిశీలించండిఆ భూములు తమ తాతల నుంచి సంక్రమించాయని, 1955-56, 1957-58 పహాణీల్లో పట్టాదారుగా తమ తాత పేరు ఉన్నదని పిటిషనర్లు వాదించగా.. 1958-59 నుంచి పహాణీలో శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయం పట్టాదారుగా, పిటిషనర్లు అనుభవదారులుగా ఉన్నట్టు దేవాదాయశాఖ తెలిపింది. ఆలయ నిర్వహణ కోసం సేవా ఇనాంగా దాతలు ఆ భూములను ఇచ్చారని పేర్కొన్నది. దీంతో రికార్డులను పరిశీలించిన హైకోర్టు.. పట్టాదారుకు, అనుభవదారుకు తేడా ఉన్నదని, భూమిని అనుభవిస్తున్నట్టు ఉన్న రెవెన్యూ రికార్డులు యాజమాన్య హకులను నిర్ధారించలేవని స్పష్టం చేసింది. హకులను సివిల్ కోర్టులో తేల్చుకోవాలంటూ ట్రిబ్యునల్ ఇచ్చిన ఉత్తర్వులు చట్టవిరుద్ధంగా, ఏకపక్షంగా లేవని పేరొంటూ పిటిషనర్ల వ్యాజ్యాన్ని కొట్టివేసింది.

## గండిమైసమ్మలో 'సుపథం హోటల్స్' ప్రారంభం

- ప్రారంభించిన మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్
- నిర్వాహకులకు శుభాకాంక్షలు





మేడ్చల్--మల్కాజిగిరి గండిమైసమ్మలో నూతనంగా ఏర్పాటు చేసిన 'సుపథం హోటల్స్'ను మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా హోటల్ నిర్వాహకులకు ఆయన శుభాకాంక్షలు తెలియజే శారు.నూతన వ్యాపార సంస్థను ఏర్పాటు చేసిన నిర్వాహకులను అభినందించిన ఈటల రాజేందర్, హోటల్ నిర్వహణ విజయ వంతంగా కొనసాగాలని ఆకాంక్షించారుఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్--మల్కాజిగిరి అర్బన్ జిల్లా అధ్యక్షుడు డి. గిరివర్ధన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విఘ్నేష్, మాజీ కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, బీజేపీ సీనియర్ నాయకులు మల్లేష్ యాదవ్, గొరిగే శేఖర్, రాజు ముదిరాజ్, సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అట్టికా గోల్డ్‌పై ఈడీ పంజా




హైదరాబాద్, సెప్టెంబర్ 25 చోరీకి గురైన బంగారు వస్తువుల కొనుగోలు, సేకరణ, ఇతర అక్రమ లావాదేవీల ద్వారా నేరపూరిత ఆదాయాన్ని ఆర్జించినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న అట్టికా గోల్డ్ ప్రైవేట్ లిమిటెడ్‌పై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు పంజా విసిరారు. బెంగళూరు, చెన్నై, హైదరాబాద్, విశాఖపట్నంలో ఈ నెల 23, 24న ఆ కంపెనీకి సంబంధించిన 16 ప్రాంగణాల్లో సోదాలు నిర్వహించారు.
'అట్టికా గోల్డ్' ప్రధాన కార్యాలయం, శాఖలతోపాటు ఆ కంపెనీ డైరెక్టర్లు, మాజీ డైరెక్టర్లు, వాటాదారులు, ఇతర కీలక వ్యక్తుల నివాస, వ్యాపార ప్రాంగణాల్లో జరిగిన ఈ సోదాల్లో రూ.7.52 లక్షల నగదుతోపాటు విదేశీ కరెన్సీ, బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, పలు పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు ఈడీ వెల్లడించింది.
'అట్టికా గోల్డ్'పై వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన ఎఫ్‌ఐఆర్‌లు, పోలీసులు దాఖలు చేసిన చార్జిషీట్ల ఆధారంగా మనీ లాండరింగ్ నిరోధక చట్టం కింద దర్యాప్తు ప్రారంభించిన ఈడీ.. ఈ కేసులో పీఎస్ అయూబ్ అలియాస్ బొమ్మనహళ్లి బాబు, ఒబెదుల్లా ఏ మహ్మద్ సల్మాన్ ఏ అర్బిన్ తాజ్ తదితర కీలక వ్యక్తులు పరారీలో ఉన్నట్టు తెలిపింది.

## 5 'సీ'లకు ప్రజాస్వామ్యం బందీ

**ఎక్స్‌లో ఎమ్మెల్సీ దాసోజు ఆగ్రహం**




హైదరాబాద్, సెప్టెంబర్ 25భారత ప్రజాస్వామ్యం పరిహాసానికి వేదికగా మారిందని ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ విమర్శించారు. ఇది ఏండ్ల నుంచి లోతుగా పాతుకుపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రస్తుత ప్రజాస్వామ్యం ఐదు 'సీ'లకు బందీగా మారిందని వ్యాఖ్యానించారు. కులం (క్యాస్ట్), నగదు (క్యాష్), మతతత్వం (కమ్యూనలిజం), అవినీతి (కరప్షన్), నేరపూరిత రాజకీయాలు (క్రిమినాలిటీ) ప్రజాస్వామ్యాన్ని ప్రభావితం చేస్తున్నాయని ఎక్స్ వేదికగా తన అభిప్రాయం వ్యక్తంచేశారు. ఈ మేరకు కార్టూనిస్ట్ మంజుల్ వేసిన కార్టూన్‌ను పోస్టు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో నెలకొన్న పరిణామాలపై తన అసంతృప్తిని వ్యక్తంచేశారు

# ముప్పారం కొత్త వాడ గణేశుని సందర్శించిన ధర్మసాగర్ ఎస్ హెచ్ ఓ శ్రీనివాసు





వివేక సమయం ప్రతినిధి ధర్మసాగర్:- హనుమకొండ జిల్లా, ధర్మసాగర్ మండలం, ముప్పారం గ్రామం కొత్త వాడలో ఏర్పాటుచేసిన గణేశుని ముఖ్య అతిథిగా ధర్మసాగర్ మండల ఎస్ హెచ్ ఓ శ్రీనివాసు సందర్శించి పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. గ్రామ సర్పంచి గుంటి పెళ్లి రేణుక వెంకట్ మాట్లాడుతూ గ్రామంలో కొత్తవాడలో ఏర్పాటుచేసిన గణేష్ ని సందర్శించి చాలెంజ్ యూత్ యువత ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్ని సౌకర్యాలను చూసి సంతృప్తి వ్యక్త పరిచారు. వచ్చే బతుకమ్మ, దసరా ఏర్పాట్లను కూడా దగ్గరుండి గ్రామ ప్రజలకు కావలసిన అన్ని అవసరాలను ఏర్పాటు చేస్తామన్నారు.

ముఖ్య అతిథిగా వచ్చిన ధర్మ సార్ మండల ఎస్ హెచ్ ఓ శ్రీనివాసు మాట్లాడుతూ గ్రామాలలోని యువత డ్రగ్స్ మరియు మత్తు పదార్థాలకు అలవాటు పడకూడదని అన్నారు. డ్రగ్స్ మరియు మత్తు పదార్థాలు తీసుకోవడం వలన ప్రాణాలకు హాని కలగడమే కాకుండా కుటుంబాలలో తగాదాల రావడం వలన కొన్ని సందర్భాలలో ప్రాణ నష్టం కూడా జరుగుచున్నది. మంచి ప్రవర్తన ఉన్నవారికి న్యాయం చేస్తాను కానీ చట్ట వ్యతిరేక పనులు చేసే వారిని ఉపేక్షించను అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, వాడ పెద్దలు మరియు పిల్లలు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

# హుజురాబాద్ రైతు ఉత్పత్తిదారుల సంఘం నూతన చైర్మన్‌గా నర్ర శ్రీనివాస్ రెడ్డి.



వివేక సమయం ప్రతినిధి హుజురాబాద్

హుజురాబాద్ రైతు ఉత్పత్తిదారుల పరస్పర సహాయ సహకార సంఘం వార్షిక మహాసభ సింగపూర్ రైతు వేదికలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన చైర్మన్‌గా నర్రా శ్రీనివాస్ రెడ్డిని 15 మంది పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో తుమ్మనపల్లి, సింగపూర్, మాందాడిపల్లి, పోతిరెడ్డిపేట గ్రామాలకు చెందిన రైతు సభ్యులు పాల్గొన్నారు. సమావేశానికి ముఖ్య అతిథిగా కేవీకే ప్రధాన శాస్త్రవేత్త వెంకటేశ్వరరావు హాజరయ్యారు. అలాగే సీఎస్ఏ ప్రతినిధులు, అగ్రికల్చర్ ఏఈఓ సౌమ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతు ఉత్పత్తిదారుల సంఘం కార్యకలాపాలు, రైతుల అభివృద్ధికి చేపట్టాల్సిన చర్యలపై వారు వివరించారు. ప్రస్తుతం ఈ రైతు ఉత్పత్తిదారుల సంఘంలో 752 మంది సభ్యులు ఉన్నారని, సుమారు రూ.30 లక్షల నిధులతో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రైతులను సంఘటితం చేసి, వారి వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన మార్కెట్ సౌకర్యాలు కల్పించడం, రైతుల ఆర్థిక అభివృద్ధికి సహకరించడం వంటి లక్ష్యాలతో సంఘం ముందుకు సాగుతున్నట్లు తెలిపారు.

# విజయవాడ దుర్గగుడి ఘాట్ రోడ్డుపై విరిగిపడ్డ కొండచరియలు



అమరావతి : విజయవాడ దుర్గగుడి ఘాట్ రోడ్డుపై కొండచరియలు విరిగి పడ్డాయి. దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఘాట్‌రోడ్‌లో మరమ్మ తుల కారణంగా రోడ్డును మూసివేసిన సమయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. దీంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన పై మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి అధికారులను అడిగి పూర్తి వివరాలు తెలుసు కున్నారు. భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు .అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు.

# 10 అంశాల్లో ఆరింటిలో అత్యుత్తమ పనితీరు

**- ఈగల్ ఫోర్స్‌కు డీజీపీ సి.వి.ఆనంద్ అభినందనలు**

**- యువతను కాపాడుకోవడం మనందరి బాధ్యత.. 'నషాముక్తి తెలంగాణ' కోసం సమష్టిగా పనిచేద్దాం**



తెలంగాణ, డ్రగ్స్ నియంత్రణలో తెలంగాణ పోలీసులు జాతీయస్థాయిలో అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తున్నారని డీజీపీ సి.వి.ఆనంద్ అభినందించారు. సెప్టెంబరు 22, 23 తేదీల్లో జరిగిన జాతీయస్థాయి యాంటీ నార్కోటిక్స్ అధిపతుల సమావేశంలో వెల్లడైన పనితీరు వివరాల ప్రకారం.. 10 కీలక అంశాల్లో తెలంగాణ పోలీసులు ఆరింటిలో ముందంజలో నిలిచారని తెలిపారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఇతర అధికారులు, సిబ్బందితో డీజీపీ సమావేశమై పనితీరును సమీక్షించారు.

డ్రగ్స్ వల్ల యువత, సమాజ భవిష్యత్తుకు తీవ్ర ముప్పు ఏర్పడుతోందని.. మాదకద్రవ్యాల నియంత్రణలో తెలంగాణ పోలీసుల కృషి దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని డీజీపీ పేర్కొన్నారు. డ్రగ్స్ నిర్మూలనకు ప్రభుత్వం పోలీసులకు పూర్తి స్వేచ్ఛ, సహకారం అందిస్తోందని తెలిపారు. 'నషాముక్తి తెలంగాణ--నషాముక్తి భారత్' లక్ష్యంతో ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేయాలని సూచించారు.

### అరెస్టుల్లో జాతీయ సగటు కంటే మూడింతలు ఎక్కువ

డ్రగ్స్ కేసుల్లో అరెస్టుల విషయంలో తెలంగాణ పోలీసులు గణనీయమైన పనితీరు కనబరిచారని అధికారులు డీజీపీకి వివరించారు. జాతీయస్థాయిలో ప్రతి కేసుకు సగటున 1.3 మంది అరెస్టు చేస్తుండగా.. తెలంగాణలో ఆ సంఖ్య 3.7గా ఉందని తెలిపారు. డ్రగ్స్ నెట్‌వర్క్‌పై లోతుగా దర్యాప్తు చేస్తూ, సంబంధిత వ్యక్తులపై సమగ్రంగా చర్యలు తీసుకుంటున్న తీరుకు ఇది నిదర్శనమని పేర్కొన్నారు.

### ఆస్తుల స్వాధీనం.. యువత, మైనర్లను రక్షించేందుకు ప్రత్యేక చర్యలు

డ్రగ్స్ అక్రమ రవాణా, విక్రయాలతో సంబంధం ఉన్న వారి ఆస్తులను చట్టప్రకారం స్వాధీనం చేసుకోవడంలోనూ తెలంగాణ పోలీసులు ముందున్నారు. ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 68ఎఫ్ కింద డ్రగ్స్ అక్రమ కార్యకలాపాలతో ముడిపడిన ఆస్తులపై చర్యలు తీసుకుంటున్నారు. అదే సమయంలో డ్రగ్స్ బారిన పడే అవకాశం ఉన్న యువత, మైనర్లను రక్షించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు అధికారులు వివరించారు.

### అంతర్రాష్ట్ర, అంతర్జాతీయ నెట్‌వర్క్‌పై నిఘా

తెలంగాణ ఈగల్ ఫోర్స్ డ్రగ్స్ నెట్‌వర్క్ మూలాలను ఛేదించేందుకు రాష్ట్ర సరిహద్దులు దాటి కూడా దర్యాప్తు చేపడుతోంది. థాయిలాండ్, గోవా, ముంబయి తదితర ప్రాంతాలకు వెళ్లి డ్రగ్స్ సరఫరా, రవాణా వ్యవస్థపై ఆధారాలు సేకరించి కేసులు నమోదు చేసినట్లు డీజీపీకి వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో విస్తరించిన నెట్‌వర్క్‌లపై సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

### డార్క్‌వెబ్‌పై ప్రత్యేక నిఘా

డార్క్‌వెబ్ కార్యకలాపాలపై విశ్లేషణ చేపట్టి డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్న నెట్‌వర్క్‌లను గుర్తించడంలోనూ ఈగల్ ఫోర్స్ ప్రత్యేక దృష్టి సారించింది. డార్క్‌వెబ్ ద్వారా జరుగుతున్న అక్రమ లావాదేవీలను గుర్తించి, భారీ మొత్తంలో డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వివరించారు. సుమారు 500 కిలోలకు పైగా డ్రగ్స్‌కు సంబంధించిన 15కుపైగా కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.

డ్రగ్స్ నియంత్రణలో ఉత్తమ నిర్మాణం, కేసుల్లో అరెస్టులు, ఆస్తుల స్వాధీనం, అంతర్జాతీయ స్థాయి దర్యాప్తు, డార్క్‌వెబ్ విశ్లేషణ, భారీ మొత్తంలో డ్రగ్స్ స్వాధీనం వంటి ఆరు అంశాల్లో తెలంగాణ పోలీసులు జాతీయస్థాయిలో ముందంజలో ఉన్నారని డీజీపీ పేర్కొన్నారు.

### మిగిలిన అంశాల్లోనూ ముందుండాలి

డ్రగ్స్ నియంత్రణలో ఇప్పటివరకు సాధించిన విజయాలతో సంతృప్తి చెందకుండా.. మిగిలిన అంశాల్లోనూ తెలంగాణ పోలీసులు మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని డీజీపీ ఆకాంక్షించారు. భవిష్యత్ తరాలను మాదకద్రవ్యాల బారి నుంచి కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని స్పష్టం చేశారు.'యువతను కాపాడుకుంటేనే తెలంగాణ భవిష్యత్తు సురక్షితంగా ఉంటుంది. నషాముక్తి తెలంగాణ, నషాముక్తి భారత్ లక్ష్యంగా మనందరం సమష్టిగా పనిచేయాలి. డ్రగ్స్ నియంత్రణలో దేశానికి తెలంగాణను ఆదర్శంగా నిలిపేలా మరింత కృషి చేద్దాం" అని డీజీపీ సి.వి.ఆనంద్ పిలుపునిచ్చారు

# సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా డిమాండ్..

## ఢిల్లీలో ఈసీఐ వద్ద భద్రత పెంపు



సీఈసీ జ్ఞానేష్ కుమార్ తన పదవికి రాజీనామా చేయాలంటూ దేశవ్యాప్తంగా డిమాండ్ పెరుగుతున్న సంగతి తెలిసిందే. ఆందోళనలు జరుగుతున్న దృష్ట్యా ఢిల్లీలోని ఎన్నికల సంఘం ప్రధాన కార్యాలయం వద్ద ప్రభుత్వం భద్రత పెంచింది ప్రభుత్వం. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన సర్ సహా వివిధ అంశాలలో ఈసీఐ సభ్యుల మధ్య విబేధాలు తలెత్తిన సంగతి తెలిసిందే. సర్ ద్వారా బీజేపీకి అనుకూలంగా సీఈసీ జ్ఞానేష్ కుమార్ వ్యవహరించారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నారు.ఈ నేపథ్యంలో జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కాంగ్రెస్, టీఎంసీ, ఎస్పీ సహా ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ మేరకు ఇప్పటికే దేశంలోని అనేక చోట్ల ప్రతిపక్షాల ఆధ్వర్యంలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎదుట కాంగ్రెస్ ఎమ్మెల్యేలు జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా ఆందోళన చేశారు. అతడు తన పదవికి రాజీనామా చేయాలని, అరెస్టు చేయాలని వారు డిమాండ్ చేశారు. మధ్యప్రదేశ్, పంజాబ్, పశ్చిమ బెంగాల్‌లలో కూడా ఆందోళనలు జరుగుతున్నాయి. జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని కోరుతున్నారు. ఇండియన్ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నేతలు ఆందోళన చేస్తున్నారు. 2024 లోక్‌సభ ఎన్నికలతో పాటు అనేక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. ఈ నేపథ్యంలో జ్ఞానేష్ కుమార్‌పై పార్లమెంట్‌లో అభిసంశన తీర్మానం ప్రవేశపెట్టాలని భావిస్తున్నారు. జ్ఞానేష్ కుమార్‌కు వ్యతిరేకంగా కర్ణాటక కాంగ్రెస్ పోలీసులకు ఫిర్యాదు చేసి, ఎఫ్ఐఆర్ నమోదు చేసింది.ఇదే సమయంలో ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మరోసారి దీక్ష చేసేందుకు సీజేపీ (కాక్రోచ్ జనతా పార్టీ) సిద్ధమవుతోంది. 48 గంటల్లోగా సీఈసీ రాజీనామా చేయకపోతే ఇంకోసారి నిరసనకు దిగుతామని సీజేపీ హెచ్చరించింది. ఇలాంటి ఆందోళనల నేపథ్యంలో ఢిల్లీలోని ఎన్నికల సంఘం కార్యాలయం వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# నన్ను ఎన్‌కౌంటర్‌లో చంపేస్తారేమో.

## సోనమ్ వాంగ్‌చుక్ ఆందోళన



తనను ఎన్‌కౌంటర్‌లో చంపేస్తారేమో అని ప్రముఖ పర్యావరణవేత్త, ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ అన్నారు. లదాఖ్‌ను ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పాటు చేయాలని గత ఏడాది స్థానికులు లేహ్‌లో ఆందోళన నిర్వహించారు. గత ఏడాది సెప్టెంబర్ 24న ఈ ఆందోళన నిర్వహించగా.. ఇది హింసకు దారితీసింది. ఈ సందర్భంగా చెలరేగిన ఘర్షణలో నలుగురు మరణించారు. భద్రతా బలగాలు జరిగిన కాల్పుల్లో వారు ప్రాణాలు కోల్పోయారు.

అనంతరం పదుల సంఖ్యలో పౌరుల్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన జరిగి ఏడాది పూర్తైన సందర్భంగా గురువారం వాంగ్‌చుక్ మీడియాతో మాట్లాడారు. ఈ ఘటనకు బాధ్యత వహిస్తూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలని వాంగ్‌చుక్ డిమాండ్ చేశారు. ఈ ఆందోళన సందర్భంగా హిందువులకు, బౌద్ధులకు మధ్య గొడవలు సృష్టించేందుకు, ఈ ప్రాంతలో హింసను ప్రేరేపించేందుకు కుట్రలు జరిగాయని సోనమ్ వాంగ్‌చుక్ ఆరోపించారు. నేను ఈ రోజు ఈ విషయం గురించి మాట్లాడిన తర్వాత నన్ను అణచివేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుంది. గతంలో కూడా ఇలాగే చేశారు. నన్ను జైలుకు పంపారు. ఇప్పుడు మిగిలింది నన్ను ఎన్‌కౌంటర్ చేయడమే. నన్ను ఎన్‌కౌంటర్ చేయాలని నేను కూడా కోరుకుంటున్నాను. నా ఎన్‌కౌంటర్ జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. నా ఎన్‌కౌంటర్‌తో దేశం మేల్కొంటుందని భావిస్తున్నా అంటూ వాంగ్‌చుక్ అన్నారు. లదాఖ్‌లో గురువారం వందలమంది గుమిగూడారు. గత ఏడాది హింస సందర్భంగా మరణించిన వారికి నివాళి అర్పించారు. ఈ ప్రాంతంలో హింసకు కుట్ర జరిగిందని స్థానిక ఉద్యమకారులు ఆరోపిస్తున్నారు. ఎలాంటి సూచనలు లేకుండానే గత ఏడాది భద్రతా బలగాలు కాల్పులు జరిపారని వారు విమర్శిస్తున్నారు.

# మార్చి వరకూ వర్క్ ఫ్రమ్ హోమ్..

## భారత్‌లోని హెచ్-1బీ ఉద్యోగులకు అమెజాన్ అనుమతి




వీసా ఇంటర్వ్యూ అపాయింట్‌మెంట్స్‌లో జాప్యం కారణంగా భారత్‌లో ఉండిపోయిన తమ హెచ్-1బీ ఉద్యోగులు అమెజాన్ గుడ్ న్యూస్ చెప్పింది. మార్చి వరకూ వారికి వర్క్ ఫ్రమ్ హోమ్‌ను అనుమతిస్తున్నట్టు తెలిపింది. ఉద్యోగులు ఆఫీసుకు తప్పనిసరిగా రావాలని మైక్రోసాఫ్ట్ వంటి సంస్థలు స్పష్టం చేసిన తరుణంలో అమెజాన్ ఈ నిర?యం తీసుకోవడం గమనార్హం

జాతీయ మీడియా కథనాల ప్రకారం, అంతర్గత ప్రకటనలో అమెజాన్ ఈ విషయాన్ని వెల్లడించింది. డిసెంబర్ 13 మొదలు భారత్‌లో వీసా అపాయింట్‌మెంట్ రీషెడ్యూలింగ్ కోసం వేచి చూస్తున్న హెచ్-1బీ వీసాదారులను వర్క్ ఫ్రమ్ హోమ్‌కు అనుమతిస్తున్నట్టు తెలిపింది. మార్చి 2 వరకూ వారికి ఈ వెసులుబాటు ఉంటుందని తెలిపింది.

అయితే.. వారి కార్యకలాపాలపై కొన్ని పరిమితులు కూడా విధించింది అమెజాన్. కస్టమర్లతో చర్చలు, కోడింగ్, వ్యూహాత్మక నిర?యాలు ఏవీ తీసుకోవడానికి వీల్లేదని తెలిపింది. కోడింగ్‌కు సంబంధించి సమస్యల పరిష్కారం, టెస్టింగ్ వంటివి చేపట్టేందుకు వారికి అనుమతి లేదు. అంతేకాకుండా, భారత్‌లో ఉన్న సమయంలో వారెవరూ ఇక్కడి అమెజాన్ సంస్థలకు వెళ్లకూడదు. ఇక మార్చి 2 తరువాత వీసా అపాయింట్‌మెంట్స్ ఉన్న వారిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది.

హెచ్-1బీ వీసా విధానానికి ట్రంప్ ప్రభుత్వం భారీ మార్పులు చేయడంతో అనేక అమెరికా సంస్థలు ఇక్కట్లు పాలవుతున్నాయి. వీసా జారీకి ముందు అభ్యర్థుల సోషల్ మీడియా ప్రొఫైల్స్‌ను తనిఖీ చేయాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో వీసా రెన్యూవల్స్‌కు సంబంధించిన అపాయింట్‌మెంట్ డేట్స్ జూన్ వరకూ వాయిదాపడ్డాయి. దీంతో, అమెరికాను వీడొద్దంటూ గూగుల్, మైక్రోసాఫ్ట్ లాంటి సంస్థలు తమ హెచ్-1బీ వీసా ఉద్యోగులకు సూచించాయి.




## ఒక్కసారిగా పెరిగిన గోల్డ్, సిల్వర్ ధరలు.. ఎంతో తెలిస్తే

శుక్రవారం బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. డిమాండ్ పెరగడంతో పాటు డాలర్ బలహీనపడటంతో ధరలు అమాంతం పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, దేశంలో శుక్రవారం మధ్యాహ్నం 12.00 గంటల సమయంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర ఏకంగా రూ.1,140 మేర పెరిగి రూ.1,36,200కు చేరింది. 22 క్యారెట్ గోల్డ్ ధర కూడా సుమారు వెయ్యి మేర పెరిగి రూ.1,24,850కు చేరుకుంది. వెండి ధర కూడా జోరందుకుంది. నిన్నటితో పోలిస్తే నేడు కిలో వెండి ధర ఏకంగా రూ.4 వేల మేర పెరిగి రూ.2,42,000కు చేరింది

నగరాల వారీగా చూస్తే చెన్నైలో 24 క్యారెట్ బంగారం స్పాట్ రేటు రేటు అత్యధికంగా రూ.1,37,240గా ఉంది. ముంబై, హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల్లో రూ.1,36,200గా ఉంది. ఇక చెన్నైలో 22 క్యారెట్ స్పాట్ 10 గ్రాముల గోల్డ్ రేటు 1,25,800గా ఉంటే, హైదరాబాద్, బెంగళూరు, విజయవాడ వంటి నగరాల్లో రూ.1,24,850గా ఉంది. చెన్నైలో కిలో వెండి రేటు రూ.2.6 లక్షలకు చేరింది. ముంబై, బెంగళూరులో నగరాల్లో రూ.2.42 లక్షలుగా, హైదరాబాద్‌లో రూ.2.60 లక్షలుగా ఉంది.

ఇక బంగారం ఫ్యూచర్స్ (ఏప్రిల్) ధర రూ.721 మేర పెరిగి రూ.1,40,424కు చేరుకుంది. కిలో వెండి ఫ్యూచర్స్ (మార్చ్) ధరలు కూడా భారీగా పెరిగాయి. ఒకానొక దశలో దాదాపు 7 వేల మేర పెరిగి రూ. 2,43,443ల గరిష‘స్థాయిని తాకింది. ప్రస్తుతం రూ.2,39,041 వద్ద ట్రేడవుతోంది. నిన్నటితో పోలిస్తే ఇది దాదాపు రూ. 3 వేలు ఎక్కువ.

## నెయ్యిని రోజూ ఉదయాన్నే పరగడుపునే తింటే కలిగే అదుతేమైన లాభాలు ఇవే..!



ఎ పాలతో తయారు చేసే పదార్థాల్లో నెయ్యి కూడా ఒకటి. నెయ్యి మన ఆహారానికి చక్కటి రుచిని అందిస్తుంది. నెయ్యితో మనం అనేక తీపి వంటకాలను తయారు చేసుకుని తింటూ ఉంటాం. నెయ్యితో చేసే వంటకాలను అందరూ ఇష్టపడతారని చెప్పవచ్చు. నెయ్యిని తీసుకోవడం వల్ల మన ఆరోగ్యానికి ఎంతో మేలు కలుగుతుంది. ఆయుర్వేదంలో నెయ్యిని అనేక చికిత్సల్లో ఉపయోగిస్తూ ఉంటారు. అయితే ఆహారంతో కలిపి నెయ్యిని తీసుకోవడానికి బదులుగా నెయ్యిని ఉదయం పూట తీసుకోవడం వల్ల మనం మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చని వైద్యులు చెబుతున్నారు. మన ఉదయాన్ని నెయ్యితో ప్రారంభించడం వల్ల మన ఆరోగ్యానికి కలిగే ప్రయోజనాల గురించి వారు వివరిస్తున్నారు.

జీర? వ్యవస్థకు..

నెయ్యిని తీసుకోవడం వల్ల జీర?క్రియ మెరుగుపడుతుంది. జీర?శయాంతర ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. ప్రేగు కదలికలు మెరుగుపడతాయి. దీంతో ఆహారం సులభంగా జీర?మవుతుంది. నెయ్యిలో బ్యూట్రిక్ యాసిడ్ ఉంటుంది. ఇది దాని యాంటీ ఇన్‌ఫ్లామేటరీ లక్షణాలకు ప్రసిద్ధి చెందింది. ఇందులో ఉండే యాంటీ ఇన్‌ఫ్లామేటరీ లక్షణాల వల్ల పేగు ఆరోగ్యంతో పాటు శరీర ఆరోగ్యం కూడా మెరుగుపడుతుంది. శరీరంలో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. నెయ్యిలో శోథ నిరోధక లక్షణాలు కూడా ఉంటాయి. దీనిని తీసుకోవడం వల్ల వాపులు, నొప్పులు వంటి సమస్యలు కూడా తగ్గుతాయి. నెయ్యిని తీసుకోవడం వల్ల విటమిన్ ఎ, డి, ఇ, కె వంటి పోషకాలను మన శరీరం ఎక్కువగా గ్రహించుకుంటుంది. దీంతో శరీరంలో ఆయా విటమిన్ల లోపం లేకుండా ఉంటుంది.

మెదడు పనితీరుకు..

నెయ్యిలో ఉండే కొవ్వు ఆమ్లాలు మెదడు పనితీరును మెరుగుపరుస్తాయి. అభిజ్ఞా పనితీరును మెరుగుపరచడంలో, జ్ఞాపకశక్తిని పెంచడంలో, ఏకాగ్రతను పెంచడంలో కూడా నెయ్యి మనకు సహాయపడుతుంది. నెయ్యిని తీసుకోవడం వల్ల శరీర శక్తి స్థాయిలు పెరుగుతాయి. అంతేకాకుండా దీనిలో ఉండే కొవ్వులు, విటమిన్లు చర్మం, జుట్టు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. నెయ్యిని ఉదయం పూట తీసుకోవడం వల్ల జీవక్రియ మెరుగుపడుతుంది. తద్వారా శరీర బరువు అదుపులో ఉంటుంది. నెయ్యిని తీసుకోవడం వల్ల గుండె, ఎముకల ఆరోగ్యం మెరుగుపడుతుంది.

## రాత్రి పూట ఎట్టి పరిస్థితిలోనూ ఈ ఆహారాలను తీసుకోకూడదు.. ఎందుకంటే..?



మనం తీసుకునే ఆహారంపైనే మన శరీర ఆరోగ్యం ఆధారపడి ఉంటుంది. మన ఆరోగ్యమే కాకుండా మన నిద్ర కూడా మనం తీసుకునే ఆహారంపైనే ఆధారపడి ఉంటుందని మీకు తెలుసా. మారిన జీవన విధానం కారణంగా మనలో చాలా మంది జంక్ ఫుడ్ ను తీసుకుంటూ ఉన్నారు. ఇది మన నిద్రపై తీవ్ర ప్రభావాన్ని చూపిస్తుంది. నిద్రలేమి సమస్యలు కూడా తలెత్తుతాయి. అంతేకాకుండా రాత్రి పూట సరిగ్గా నిద్రించకపోవడం వల్ల మరుసటి రోజు చిరుతిళ్లను తినాలనే కోరిక కలుగుతుంది. కనుక మనం నిద్రించే ముందు తీసుకోవాల్సిన ఆహారంపై తగిన శ్రద్ధ చూపించడం చాలా అవసరం. మనం తీసుకునే భోజనమే మన నిద్ర నాణ్యతను ప్రభావితం చేస్తుంది. కనుక రాత్రి భోజన విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. రాత్రి భోజనంలో కొన్ని ఆహారాలను నిషేధించాలి. రాత్రి భోజనంలో తీసుకోకూడని కొన్ని ఆహారాల గురించి పోషకాహార నిపుణులు వివరిస్తున్నారు.

కారంగా ఉండే ఆహారాలు..

కారంగా ఉండే ఆహారాలను తీసుకోవడం వల్ల గుండెల్లో మంట, యాసిడ్ రిఫ్లెక్స్ వంటి సమస్యలు తలెత్తుతాయి. దీని వల్ల నిద్రపోవడం కష్టమవుతుంది. కనుక వీటికి బదులు నిద్రించే ముందు హెర్బల్ టీ లేదా పెరుగన్నం వంటి ఆహారాలను తీసుకోవడం మంచిది. కాఫీ, టీ లలో కెఫిన్ ఉంటుంది. వీటిని తీసుకోవడం వల్ల వీటిలో ఉండే కెఫిన్ శరీరంలో గంటల తరబడి ఉంటుంది. ఇది నిద్రకు అంతరాయం కలిగిస్తుంది. కనుక కెఫిన్ కు బదులుగా గోరు వెచ్చని పాలు, హెర్బల్ టీ లను తీసుకోవడం ఉత్తమం. మద్యం తీసుకోవడం వల్ల మొదట్లో నిద్రపోయినప్పటికీ ఇది నిద్ర చక్రానికి ఆటంకం కలిగిస్తుంది. ఫలితంగా నిద్రలేమితో పాటు నిద్ర నాణ్యత కూడా లోపిస్తుంది. కనుక నిద్రించే ముందు ఆల్కహాల్ ను తీసుకోకపోవడమే మంచిది. కొవ్వు ఉండే ఆహారాలు సులభంగా జీర?మవ్వవు. దీంతో కడుపులో అసౌకర్యం, నొప్పి వంటి సమస్యలు తలెత్తుతాయి. కనుక నిద్రించే ముందు పండ్లు, కూరగాయలు వంటి ఆహారాలను తీసుకోవాలి.

చక్కెర ఆహారాలు..

చక్కెర కలిగిన ఆహారాలను తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలు పెరుగుతాయి. దీని వల్ల శక్తి తగ్గిపోతుంది.నిద్రపోవడం కష్టంగా మారుతుంది. కనుక నిద్రించే ముందు చక్కెర కలిగిన ఆహారాలను తీసుకోకూడదు. నిద్రించే ముందు ఎక్కువగా భోజనం చేయడం వల్ల కడుపులో అసౌకర్యంగా ఉంటుంది. దీని వల్ల నిద్రకు అంతరాయం కలుగుతుంది. కనుక పడుకోవడానికి కొన్ని గంటల ముందుగానే తేలికగా జీర?మయ్యే ఆహారాన్ని తీసుకోవాలి.

## గుండె ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే వెల్లుల్లి..



వంటల్లో ఉపయోగించే వివిధ పదార్థాల్లో వెల్లుల్లి ఒకటి. దీనిని ఎంతో కాలంగా మనం వంటల్లో వాడుతున్నాం. వెల్లుల్లిని వంటలల్లో వేయడం వల్ల వంటల రుచి పెరుగుతుంది. అంతేకాకుండా మన ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు కలుగుతుంది. వెల్లుల్లిలో అల్లిసిన్ అనే క్రియాశీలక పదార్థం ఉంటుంది. వెల్లుల్లిని తీసుకోవడం వల్ల గుండె ఆరోగ్యం మెరుగుపడుతుందని ఇటీవలి అధ్యయనాలు కూడా చెబుతున్నాయి. లిపిడ్ ప్రొఫైల్స్, గ్లైసెమిక్ ఇండెక్స్, రక్తపోటు, ఆక్సీకరణ ఒత్తిడి వంటి వాటిని తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో వెల్లుల్లి మనకు ఎంతో దోహదపడుతుంది. గుండె ఆరోగ్యానికి వెల్లుల్లి ఏవిధంగా సహాయపడుతుందో వైద్యులు వివరిస్తున్నారు.

రక్తపోటును తగ్గించడం..

వెల్లుల్లిలో ఉండే అల్లిసిన్ నైట్రిక్ ఆక్సైడ్ ఉత్పత్తిని పెంచుతుంది. దీంతో రక్తనాళాలు వ్యాకోచం చెందుతాయి. తద్వారా రక్తపోటు తగ్గుతుంది.

గుండెపై ఒత్తిడి తగ్గుతుంది.

గుండె మొత్తం పనితీరును మెరుగుపరచడంలో వెల్లుల్లి మనకు సహాయపడుతుంది. చెడు కొలెస్ట్రాల్ ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ ను పెంచడంలో వెల్లుల్లి మనకు ఎంతో ఉపయోగపడుతుంది. చెడు కొలెస్ట్రాల్ వల్ల ధమనుల్లో అడ్డంకులు ఏర్పడతాయి. దీంతో తీవ్రమైన గుండె సమస్యల బారిన పడాల్సి వస్తుంది. కనుక వెల్లుల్లిని తీసుకోవడం వల్ల చెడు కొలెస్ట్రాల్ తగ్గి గుండె పనితీరు మెరుగుపడడంతో పాటు గుండె కండరాలు బలంగా తయారవుతాయి.

రక్తాన్ని పలుచగా చేస్తుంది..

వెల్లుల్లిలో ఉండే సమ్మేళనాలు రక్తాన్ని పలుచగా చేసి రక్తం గడ్డకట్టడాన్ని నిరోధిస్తాయి. దీంతో గుండె జబ్బుల బారిన పడకుండా మనల్ని మనం కాపాడుకోవచ్చు. అయితే రక్తం పలుచగా అవ్వడానికి మందులు వాడే వారు వెల్లుల్లిని వాడే విషయంలో జాగ్రత్త వహించాలి. వెల్లుల్లిలో యాంటీ ఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ ఫ్లామేటరీ లక్షణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ వల్ల తలెత్తే ఆక్సీకరణ ఒత్తిడి, వాపులను తగ్గించడంలో సహాయపడతాయి.




# సల్మాన్ ఖాన్ 'మాన్‌స్టర్'.. మైండ్ బ్లోయింగ్ డీల్!

బాలీవుడ్ భాయ్‌జాన్ సల్మాన్ ఖాన్ హీరోగా, టాలీవుడ్ సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ దిల్ రాజు, దర్శకుడు వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న క్రేజీ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మాన్‌స్టర్'కు సంబంధించి ఓ వార్త వైరల్ అవుతోంది. తాజా సినిమాలు చూడండిబాలీవుడ్ భాయ్‌జాన్ సల్మాన్ ఖాన్ హీరోగా, టాలీవుడ్ సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ దిల్ రాజు, దర్శకుడు వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న క్రేజీ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మాన్‌స్టర్' (వీశీఅర్‌వతీ). లేడీ సూపర్ స్టార్ నయనతార కథానాయికగా నటిస్తోన్న ఈ పాన్ ఇండియా ప్రాజెక్ట్ షూటింగ్ శరవేగంగా సాగుతుండగానే.. ఇండస్ట్రీ ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచే రీతిలో మైండ్ బ్లోయింగ్ బిజినెస్ డీల్ కుదుర్చుకుంది.ఈ చిత్రానికి సంబంధించిన ఆల్ ఇండియా థియేట్రికల్ పంపిణీ హక్కులను ప్రముఖ మల్టీప్లెక్స్ దిగ్గజం 'పీవీఆర్ ఐనాక్స్' (ప్రూం= ×చీూశ) ఏకంగా రూ. 100 కోట్ల భారీ మొత్తానికి దక్కించుకున్నట్లు సమాచారం. ప్రస్తుత సినిమా మార్కెట్ పరిస్థితుల్లో ఎగ్జిబిషన్ రంగానికి చెందిన అగ్ర సంస్థ ఇంతటి భారీ మొత్తాన్ని రిఫండబుల్ అడ్వాన్స్ పద్ధతిలో పెట్టుబడిగా పెట్టడం దేశవ్యాప్తంగా సినీ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సల్మాన్ ఖాన్ మాస్ ఇమేజ్, వంశీ పైడిపల్లి మేకింగ్, దిల్ రాజు ప్రొడక్షన్ వేల్యూస్‌పై ఉన్న అపారమైన నమ్మకంతోనే పీవీఆర్ ఐనాక్స్ ఈ రిస్క్ చేసి భారీ డీల్ లాక్ చేసినట్లు తెలుస్తోంది.సినిమా స్క్రిప్ట్‌ఈ చిత్రంలో సల్మాన్ ఖాన్ సరికొత్త మేకోవర్‌తో పలు డిఫరెంట్ లుక్స్‌లో కనిపించబోతున్నారు.

# లవ్ అండ్ వార్'..

## రెట్రో లుక్‌లో సెగలు రేపుతోన్న ఆలియా

బాలీవుడ్ లెజెండరీ డైరెక్టర్ సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మోస్ట్ అవైటెడ్ భారీ ప్రాజెక్ట్ 'లవ్ అండ్ వార్'. ఈ మూవీ నుంచి ఆలియా భట్ ఫస్ట్ లుక్‌ని మేకర్స్ వదిలారు. సినిమా విడుదలలు 'లవ్ అండ్ వార్'.. రెట్రో లుక్‌లో సెగలు రేపుతోన్న ఆలియాబాలీవుడ్ లెజెండరీ డైరెక్టర్ సంజయ్ లీలా భన్సాలీ (ాఖఅయిఖఎ ావవశ్రీఖ దీష్టుఅయిఖశ్రీఱ) దర్శకత్వంలో తెరకెక్కుతోన్న మోస్ట్ అవైటెడ్ భారీ ప్రాజెక్ట్ 'లవ్ అండ్ వార్' తీ). రణబీర్ కపూర్ (=ఖఅఎఱతీ ఖుజూశీశీతీ), ఆలియా భట్ (, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో నటిస్తోన్న ఈ పాన్ ఇండియా చిత్రంపై దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. నిన్నటికి నిన్న రణబీర్ కపూర్ ఇంటెన్స్ వింటేజ్ లుక్‌ను విడుదల చేసి సోషల్ మీడియాలో సెన్సేషన్ సృష్టించిన మేకర్స్, తాజాగా కథానాయిక ఆలియా భట్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను అధికారికంగా విడుదల చేశారు. తన గత పీరియాడిక్ చిత్రాలకు భిన్నంగా, భన్సాలీ ఈ సినిమాలో ఆవిష్కరిస్తోన్న సరికొత్త ప్రపంచాన్ని ప్రతిబింబించేలా ఈ లుక్ రూపుదిద్దుకుంది.తాజాగా విడుదలైన ఈ పోస్టర్‌లో ఆలియా భట్ మునుపెన్నడూ చూడని గ్లామరస్, బోల్డ్ అవతార్‌లో దర్శనమిచ్చింది. రెడ్ కలర్ థై-హై స్లిట్ స్కర్ట్, ప్రత్యేకమైన క్యాబరే స్టైల్ హెడ్‌పీస్ ధరించి, కుర్చీలో కూర్చుని ఉన్న ఆలియా లుక్ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఆమె ఆహార్యం, చూపులు, స్టైలింగ్ అంతా 1960-70ల నాటి క్లాసిక్ రెట్రో మూడ్‌ను గుర్తుచేస్తున్నాయి. "ఆగ్ భీ.. దిలోంకీ



జాన్ భీ" అంటూ మేకర్స్ క్యాప్షన్ జోడించి విడుదల చేసిన ఈ పోస్టర్ నెట్టింట క్షణాల్లో వైరల్‌గా మారింది. 'గంగూబాయి కతియావాడి'తో జాతీయ ఉత్తమ నటి అవార్డును అందుకున్న ఆలియా, భన్సాలీతో కలిసి చేస్తున్న ఈ రెండో ప్రాజెక్ట్‌లో పూర్తిగా డిఫరెంట్ షేడ్‌తో కనిపించనుందని ఈ పోస్టర్ స్పష్టం చేస్తోంది.

ఈ చిత్రంలో రణబీర్ కపూర్, విక్కీ కౌశల్ ఇద్దరూ ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారుల పాత్రల్లో కనిపించనున్నట్లు వార్తలు వస్తుండగా, యుద్ధం నేపథ్యం నడుమ సాగే ఒక గాఢమైన ప్రేమ త్రికోణపు కథాంశంతో ఈ సినిమా తెరకెక్కుతోంది. భన్సాలీ మార్క్ గ్రాండ్‌నెస్, భారీ బడ్జెట్‌తో నిర్మితమవుతున్న 'లవ్ అండ్ వార్' చిత్రాన్ని 2027 జనవరి 21న హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయనున్నారు. స్టార్ తారాగణం, భన్సాలీ టేకింగ్ కలగలిసిన ఈ సినిమా వెండితెరపై సరికొత్త విజువల్ వండర్‌గా నిలుస్తుందని మేకర్స్ ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# మీ ప్రేమతో పాటు ట్రోల్స్‌ను ఎంజాయ్ చేస్తున్నా..

నేచురల్ స్టార్ నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన 'ది ప్యారడైజ్' సినిమా బాక్సాఫీస్ వద్ద భారీ విజయంతో దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో సినిమా విజయంపై, అలాగే సోషల్ మీడియాలో వస్తున్న ట్రోల్స్‌పై హీరో నాని స్వయంగా స్పందించారు. ఈ మేరకు ఆయన సోషల్ మీడియా వేదికగా ఒక సుదీర్ఘమైన, ఎమోషనల్ నోట్‌ను షేర్ చేశారు.సినిమా చూసిన ప్రేక్షకుల స్పందనలు, రియాక్షన్స్ అన్నీ తాను చూశానని నాని తెలిపారు. ప్రేక్షకులు చూపించిన ప్రేమాభిమానాలతో పాటు, వారు చేసిన నవ్వులు పూయించే హిలేరియస్ ట్రోల్స్‌ను కూడా తాను ఎంతో ఆస్వాదించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సినిమాను ప్రేక్షకులు తమ సొంత చిత్రంగా ఓన్ చేసుకున్న తీరు తన మనసును తాకిందని, అలాగే క్రిటిక్స్ మరియు రివ్యూయర్స్ ఎత్తిచూపిన తప్పుల నుంచి తాను చాలా విషయాలు నేర్చుకున్నానని నాని నిజాయితీగా అంగీకరించారు. అన్నింటికీ ధన్యవాదాలు చెప్పడం ఒక్కటే నేను చేయగలిగిన పని. ప్రేక్షకులకు ఒక సరికొత్త అనుభూతిని పంచడం కోసం మేము ఎంతో కష్టపడి, చెమటోడ్చి 'ది ప్యారడైజ్' చిత్రాన్ని తెరకెక్కించాము. ఇప్పుడు ఈ సినిమాను సెలబ్రేట్ చేసుకోవడమో లేదా విమర్శించడమో పూర్తిగా మీ చేతుల్లోనే ఉంది. ఈ సినిమాపై మీరు చూపిన ఉత్సాహం, నాపై చూపిన



ప్రేమ నన్ను కృతజ్ఞతాభావంతో నింపేశాయి అంటూ నాని తన భావాలను పంచుకున్నారు. ప్రస్తుతం నాని చేసిన ఈ పోస్ట్ నెట్టింట వైరల్ అవుతోంది.

# సితార బ్యానర్‌లో ధనుష్ కొత్త చిత్రం..

## పూజా కార్యక్రమాలతో గ్రాండ్ లాంచ్!



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ నటిస్తున్న తాజా సినిమా 'డి-56' (ఐ56) మధురైలో పూజా కార్యక్రమాలతో అధికారికంగా ప్రారంభమైంది. 'లబ్బర్ పందు' (ాబఎఎవతీ ాఖఅ౬ష్ట్రబ) సినిమాతో భారీ విజయాన్ని అందుకున్న యువ దర్శకుడు తమిళరసన్ పచముత్తు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాతో ధనుష్ కెరీర్‌లో మరో వైవిధ్యమైన చిత్రం రాబోతుందని అభిమానులు భావిస్తున్నారు.ఈ చిత్రంలో ధనుష్ సరసన ప్రీతి ముకుందన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, లెజెండరీ కమెడియన్ వడివేలు, టాలెంటెడ్ నటుడు ఎస్.జె. సూర్య మరియు 'ఉరియడి' ఫేమ్ విజయ్ కుమార్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు

. భిన్నమైన తరాల నటుల కలయికతో వస్తున్న ఈ భారీ తారాగణంపై సినిమా ఇండస్ట్రీలో ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి యువ సంగీత దర్శకుడు సాయి అభ్యాంకర్ సంగీతం అందిస్తుండటం విశేషం.

# అందం, టాలెంట్ ఉన్నా అదృష్టం కలిసిరావడం లేదు.

చిత్ర పరిశ్రమలో అందం, అభినయం ఉన్నప్పటికీ సరైన విజయాలు దక్కాలంటే కొంత అదృష్టం కూడా కలిసి రావాల్సిందే. వరుసగా అవకాశాలు వస్తున్నా సినిమాలు ఆశించిన స్థాయిలో విజయం సాధించకపోతే హీరోయిన్ల కెరీర్‌పై ఆ ప్రభావం పడుతుంది. ప్రస్తుతం యువ కథానాయిక కాయాదు లోహర్ కెరీర్ పరిస్థితి కూడా ఇలాంటి దశలోనే ఉందనే చర్చ టాలీవుడ్‌లో జరుగుతోంది. అస్సాంలో జన్మించిన కాయాదు లోహర్ పుణెలో చదువుకున్నారు. 2021లో విడుదలైన కన్నడ చిత్రం 'ముగిల్‌పేట'తో హీరోయిన్‌గా వెండితెరకు పరిచయమైన ఆమె.. ఆ తర్వాత మలయాళంతో పాటు తెలుగు సినిమాల్లోనూ అవకాశాలు అందుకున్నారు. తెలుగులో శ్రీ విష్ణు హీరోగా నటించిన 'అల్లూరి' సినిమాతో టాలీవుడ్‌లోకి అడుగుపెట్టారు.అయితే భారీ అంచనాలతో వచ్చిన ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయింది. సినిమాలో కయాదు తన అందం, నటనతో ఆకట్టుకున్నప్పటికీ.. ఆ సినిమా తర్వాత ఆమెకు వరుసగా పెద్ద అవకాశాలు దక్కలేదు. కొంత విరామం తర్వాత విశ్వక్ సేన్, అనుదీప్ కేవీ కాంబినేషన్‌లో వచ్చిన 'ఫంకీ'లో నటించారు. ఇందులో సినీ నిర్మాణ కుటుంబానికి చెందిన యువతిగా, తండ్రి బాధ్యతలను తీసుకుని స్వయంగా సినిమా నిర్మాణంలోకి అడుగుపెట్టే పాత్రలో కనిపించారు. కథలో సినీ నేపథ్యం ఉండటంతో పాటు నటనకు అవకాశం ఉన్న పాత్ర అయినప్పటికీ.. ఆ సినిమా కూడా ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో



మెప్పించలేకపోయింది. దీంతో తెలుగులో కాయాదు నటించిన తొలి రెండు సినిమాలు బాక్సాఫీస్ వద్ద విజయాన్ని అందుకోలేకపోయాయి.



# 'ది ప్యారడైజ్' కేసీఆర్ పాత్రపై రాహుల్ రామకృష్ణ ట్వీట్..

నాని హీరోగా శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన 'ది ప్యారడైజ్' సినిమా ప్రస్తుతం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. అయితే ఈ చిత్రంలో పూర్తి స్థాయి మాస్ పొలిటికల్ లీడర్‌గా కనిపించి అందరినీ ఆశ్చర్యపరిచాడు టాలెంటెడ్ యాక్టర్ ప్రియదర్శి. సినిమాలో ఆయన నటనకు, ముఖ్యంగా 'ఎమ్మెల్యే శంకరన్న' పాత్రలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ని తలపించేలా ఆయన వేసిన గెటప్, డైలాగ్ డెలివరీ సినిమాకే హైలైట్‌గా నిలిచాయి.